స్థాపితము 1928 రిజిస్టరునెం ఎ.92

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి.ఎం.ఏ

సంపుటి: 14 సంచిక: 266 :: హైదరాబాద్, గురువారము 12 - 10 - 1961 :: 4 పేజీలు 7 నయాపైసలు

101541

ఆర్. టి. సి. ఉద్యోగుల నిరీక్షణ

హైదరాబాద్, అక్టోబరు 11

ఆర్. టి. సి. ఉద్యోగుల వేతన వ్యవస్థను పరిశీలించుటకు నియమించబడిన కమిటి గత సెప్టెంబర్ ఆఖరువరకు తనని వేదికను అందచేయవలసి ఉండగా ఇంతవరకు అది అందచేయనందుకు ఆర్.టి.సి. ఉద్యోగుల వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ ఉద్యోగుల సంఘపు సెక్రెటేరియట్ ఒక తీర్మానములో పే కమిటిని త్వరలో నివేదిక అందచేయాల్సిందిగా ఆదేశించవలసినదని ఆర్. టి. సి. చైర్‌మన్‌ను అభ్యర్థించినది.

పర్లి - వైజ్‌నాథ్ లైను

అధిక వర్షాలవల్ల కొన్ని రైలుబండ్ల నిలుపుదల

హైదరాబాద్, అక్టోబరు 11

పర్లి - వైజ్‌నాథ్‌నుండి మహమదాబాద్ బిదర్ వెళ్లే 489 డాన్ మిక్సెడ్ ట్రయిను ఖాల్కి పర్లి వైజ్‌నాథ్ వెళ్ళే 490 మిక్సెడ్ ట్రయిను అధిక వర్షాల మూలముగా రద్దు చేయబడినటులు సెంట్రల్ రయిల్వే సికింద్రాబాద్ డివిజన్ వారు ప్రకటించారు. 12 వ తేదీన మహ్మదాబాద్ బిదర్‌నుండి సికింద్రాబాద్ వచ్చే 487 డాన్‌మిక్సెడ్ ట్రయిను గూడా రద్దు చేయ బడగలదని తెలుపబడుతున్నది.

సంక్షుభిత స్థితినుండి కుదుటపడ్డుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం



—: జ్యోతి ఆర్టు స్టూడియో

మూసీ నది పరవళ్ళు

హైదరాబాద్ నగరాన్ని రెండు భాగాలుగా చీలుస్తూ బక్కచిక్కి దరిద్ర నారాయణుని లా కాన్పించే మూసీనది వర్షాకాలంలో మదించిన ఆబోతులా ఉరకలు వేస్తుంది. ఈ మధ్య మూడురోజులు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినప్పటి మూసీనది చిత్రాలు ఇవి: 1. ఉస్మాన్‌సాగర్ డాంవద్ద షటర్ల నుండి నీరుప్రవహిస్తున్న దృశ్యం. 2 పురానాపుల్ ఆవలగల హిందూ శ్మశానవాటిక మూసీ ప్రవాహంలో పూర్తిగా మునిగిపోయింది.

—: రాయల్ స్టూడియో

మీరట్, అలీఘర్, చాందౌసిలలో ప్రశాంతత

పుకార్లుపుట్టించేవారు, గుండాశక్తుల అణచివేత

లక్నో, అక్టోబరు 11

ఒక్క కాస్‌గంజ్ మినహా యు.పి. అంతటా మతకలహాలు తగ్గి ప్రశాంత పరిస్థితి ఏర్పడిందని అలీఘర్ చందౌసి, మీరట్‌లలో పరిస్థితులు కుదుట పడ్డాయని ఉత్తర ప్రదేశ్ హోంమంత్రి శ్రీ చరణ్‌సింగ్ నేడు తెలిపారు.

అవసరమైన ఉపయోగించుటకు మీరట్‌లో సైన్యం రిజర్వులో ఉంచబడింది. రేపు బహుశః ఈ సైన్యం ఉపసంహరింపబడుతుంది. యెటా జిల్లాలోని కాస్‌గంజ్‌లో విద్యార్థులు ఆందోళన పూర్వక ఊరేగింపును తీయదలవగా వారి ప్రయత్నం కొనసాగనివ్వబడలేదు.

శ్రీ చరణ్ సింగ్ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇతరజిల్లాలు అనగా సహరన్‌పూర్, షాహెపూర్, వారణాసి, డెహ్రాడూన్, బిజ్నౌర్, లక్నో. అలహాబాద్, ఓరాయ్, అజమ్‌గర్‌లలో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నదన్నారు.

ఇటీవల జరిగిన మతకలహాలలో ఒక గ్రామం కూడా నష్టపడలేదని ప్రాణనష్టం మూడుపట్టణాలలోను ఆస్తి నష్టం ఐదు పట్టణాలలోను జరిగిందని యు పి. హోం మంత్రి తెలిపారు. ఇంకా ఈ వివరాలు ఇచ్చారు: ఆలీఘర్లోదొరికిన రెండుశవాలుకాక్కలుపుకొని చనిపోయినవారి సంఖ్య 34 అరెస్టులు దాదాపు రెండు వందల వరకు జరిగాయి. మీరట్‌లో 8 గంటల వరకు కర్ఫ్యూ తొలగింపబడుతున్నది. అలీఘర్ చాందౌసిలో రాత్రి మాత్రమే కర్ఫ్యూ ఉంచబడుతున్నది. పుకార్లు పుట్టించేవారు, ఉద్దేశాలు రెచ్చగొట్టేవారు అరెస్టు చేయబడుతున్నారు. మీరట్ నుండి మతకలహాల గూర్చి పాకిస్తాన్‌కు రహస్యంగా రేడియో ట్రాన్స్‌మిటర్ ద్వారా సమాచారం చేరవేయ బడుతున్నదని అనుమానింపబడుతున్నది. బులంద్‌షహర్ ముర్రాదాబాద్‌లలోట్టిఅవాంఛనీయ సంఘటనలు జరుగలేదు. గోరఖ్‌పూర్‌లో ఐదుగురు గుండాలు అరెస్టు చేయబడినారు. అలీఘర్‌లో ఒక చేతి బాంబు వేయబడగా దానివల్ల ఎటినష్టం కలుగలేదు.

విద్యార్థిసంఘ ప్రధాన ఎనిమిది మంది సభ్యుల ప్రతినిధివర్గం నేడు ప్రధాని నెహ్రూను కలసింది.

ఈ ప్రతినిధివర్గ నాయకుడు ఇష్తహాక్ హుసేన్ విద్యార్థి సంఘ అధ్యక్షుడు గూడా. ఆతను ప్రధానితో సమావేశానంతరం పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ అలీఘర్ విశ్వవిద్యాలయ పరిస్థితిని ప్రధానికి తెలిపామన్నారు. ఒక గంటసేపు ఈ ప్రతినిధివర్గం నెహ్రూతో సంభాషించింది.

ప్రధాని నెహ్రూ వద్దకు

అలీఘర్ విద్యార్థుల రాయబారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ

మున్సిపల్ చౌకధాన్యం దుకాణాల తీరు!

హైదరాబాద్, అక్టో 11

ప్రతివారం సివిల్ సప్లయి శాఖ వారు మొద్దు బియ్యం రెండువేల క్వింటల్ జంట నగరాలలోని మున్సిపల్ చౌకధాన్యపు దుకాణాలకు సరఫరా చేస్తున్నా బియ్యం వచ్చిన మొదటి రోజుననే అయిపోతున్నాయి ఇవికాక ఈదుకాణాలకు కిచిడిబియ్యం గూడా సరఫరా చేయబడుతున్నాయి.

మున్సిపల్ దుకాణాలకు సరఫరాచేయబడే మధ్యప్రదేశ్ బియ్యం వచ్చిన క్షణంలో మాయమవుతుండటంలో కొన్ని స్వార్థహస్తాలు పని చేస్తున్నాయి. బీద ప్రజలకు కలిగే లాభం పూజ్యమవుతున్నది.

(స్వ.వి.)

చిన్నతరహా నీటివనరులు

ప్రగతి పరిశీలనకు మూడు ప్రాంతీయసమావేశాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

దేశములో చిన్నతరహా నీటి వనరులు సాధించిన ప్రగతిని గురించీ, భావి కార్యక్రమాలను గురించీ న్యూఢిల్లీ, బెంగుళూరు, భువనేశ్వర్ లలో యీ నెలలో జరిగే మూడు ప్రాంతీయ సమావేశాలలో చర్చలు జరుగుతాయి. ఈ నెల 18, 14, 16 తేదీలలో బెంగుళూరులో జరిగే ప్రాంతీయ సమావేశానికి మద్రాసు, ఆంధ్రప్రదేశ్, మైసూరు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. న్యూఢిల్లీలో యీనెల 24, 27వ తేదీలలో జరిగే సమావేశంలో గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ-కాశ్మీరు రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. ఈనెల 30, 31వ తేదీన భువనేశ్వర్‌లో జరిగే సమావేశానికి పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. ఈ సమావేశాలలో ఆయా రాష్ట్రాల మంత్రులూ, ఉద్యోగులేకాక, కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ, కేంద్రసమాజాభివృద్ధి, సహకార మంత్రిత్వశాఖ ప్రతినిధులూ ప్రణాళికా సమితి ప్రతినిధులూ పాల్గొంటారు.

తృతీయ ప్రణాళికా కాలములో చిన్నతరహా నీటివనరుల వధకాలను త్వరితముగా అమలు జరిపేందుకు సాంకేతికాది ఇబ్బందులను నివారించేందుకు తీసుకోదగు చర్యలను ఈ సమావేశాలలో చర్చిస్తారు.

తృతీయ ప్రణాళికా కాలములో చిన్నతరహా నీటివనరులవల్ల 128 లక్షల ఎకరాల జనవనపు విస్తీర్ణానికి లాభం చేకూరుతుంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో దుర్ఘటన

గుంటూరు, అక్టోబర్ 11

గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఒక స్పెషల్ వార్డులో జన్మించిన శిశువు తొట్టెలో ఉండగా కుక్కనోట కరచుకొని వెళ్ళింది. ఈ సంఘటన అక్టోబర్ 10న జరిగింది.

శిశువును కుక్కనోట కరచుకొని వెళ్ళుతుండటము చూచిన డాక్టరు దానిని వెంబడించగా కొంతదూరము అడిగెత్తి శిశువును పారవేసింది. ఆ శిశువు రెండుకాళ్ళను కుక్క తిన్నది. సాయంత్రానికల్లా శిశువుచనిపోయింది కుక్క శిశువును నోటకరచుకొని వెళ్ళిన సమయములో తల్లి స్పృహ లేని స్థితిలో ఉండెను. ఈ సంఘటనపై దర్యాప్తు జరుగుచున్నది.

ఘోరమైన బస్సు ప్రమాదం

52 మంది మృతి

పాటియాలా, అక్టోబర్ 11

ఇక్కడికి 42 మైళ్ళ దూరములో గల ఖానౌరి బ్రిడ్జి వద్ద 52 మంది ప్రయాణీకులతో వెళ్ళుతున్న బస్సు ఖాల్వా కాలువలో పడినది. ప్రయాణీకులంతా ప్రాణాలు కోల్పోయి ఉంటారని తలచబడుతున్నది.

డ్రైవర్, కండక్టర్, ఒక ప్రయాణీకుడు మాత్రం బతికి బయట పడ్డారు.

హింద్ మోటార్స్ ఫ్యాక్టరీ లాకౌట్

కలకత్తా, అక్టోబరు 11

ఇక్కడికి ఏడుమైళ్ళ దూరములో గల ఉత్తర పారాలోని హింద్ మోటార్సు మేనేజిమెంట్ నేడు తమ ఫ్యాక్టరీని శాశ్వాలికముగా మూసివేశారు. పనివారులు బోనసును కోరుతూ సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చినందున మేనేజిమెంటు ఈచర్యకు దిగింది.

ఏదినత్యం? ఏదసత్యం?

కాంగ్రెసే మత తత్వాన్ని ప్రేరేపిస్తున్నదట

పంజాబ్ వ్యవహారంలో ఏర్పాటుచేసే కమిషన్ 'కండ్లతుడుపు కమిషన్' అని శ్రీ ఉపాధ్యాయ

(స్వ. వి.) హైదరాబాద్, అక్టోబర్ 11

మన దేశంలో మతతత్వాన్ని చావనీయకుండా ప్రాణం పోసి పోషిస్తున్నది కాంగ్రెస్, పి. ఎస్. పి., కమ్యూనిస్టు పార్టీ లాంటి సంస్థలేనని ఇవి ముస్లింల సంతృప్తి పరచడానికి సర్వవేళలా కృషి చేస్తున్నాయని మతం, భాష, కులం మున్నగు రూపాలలో రిజర్వేషన్‌ల సృష్టించి అధికారంలోగల పక్షమే జాతీయ సమైక్యతకు భంగకారిగా ఉన్నదని అఖిలభారత జనసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ నేడు ఆరోపించారు.

ఇక్కడ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ శ్రీ దయాళ్ తమ పార్టీ మత తత్వ పూరితమైనది కాదని కమ్యూనిస్టుల పాలన కన్నా కాంగ్రెసు పాలనే చాలా మెరుగని తెలిపారు.

అఖిలభారత జనసంఘ కార్యదర్శి ఉపాధ్యాయ ఆంధ్ర ప్రాంత పర్యటనను పూర్తిచేసుకొని నేడు ఇక్కడికి రాగా జనసంఘ సభ్యులు సానుభూతి వరుబు వీరికి స్వాగతం చెప్పారు.

రానున్న ఎన్నికలలో జనసంఘం దేశవ్యాప్తంగా 14 వందల అభ్యర్థులు నిలుపుతుందన్నారు. ఉత్తరప్రదేశ్ లో అసెంబ్లీ మరియు పార్లమెంటు స్థానాలలో 180 మధ్యప్రదేశ్‌లో 200 రాజస్థానులో 180 పంజాబ్‌లో 180 మహారాష్ట్రలో 50 శాతం స్థానాలకు పోటీ చేయగలదని వీరు తెలిపారు.

తెలంగాణాలోకొన్ని అసెంబ్లీస్థానాలకు హైదరాబాద్ సికింద్రాబాద్ నగరాలలో పార్లమెంటుమరియు అసెంబ్లీ స్థానాలకు జనసంఘం అభ్యర్థుల నిలబెడ్తుందని ఉపాధ్యాయ వివరించారు. తమపార్టీ ఐక్యఫ్రంట్‌ల ఏర్పరచదని ఏపార్టీతోనూ ఎన్నికలలో పొత్తుకు దిగదని నియోజక వర్గంలో అవసరమైనచో కొన్ని సర్దుబాట్లు చేసుకోగలదని అదైనా ముస్లిలీగ్ కమ్యూనిస్టు పార్టీ ద్రవిడమున్నేత్ర కజగంతో కాదని అన్నారు. స్వతంత్ర పార్టీతో ఇంకా ఇట్టి సర్దుబాట్లగూర్చి ఆలోచించ లేదన్నారు. ఏనియోజక వర్గంలో నైనా ప్రత్యక్ష పోటీకన్నా మూడు పార్టీలు నాల్గుపార్టీలు పోటీ చేసిన తమ అభ్యర్థులే గెలువగలరని ఇప్పటివరకు ఇది తమఅనుభవంలోకి వచ్చిన విషయమన్నారు.

జనసంఘం ఎన్నికల ప్రణాళిక ముసాయిదా ఈవరకే వెల్లడిచేయబడిందని నవంబర్ అర్ధభాగములో వారాణాసిలో జరిగే సంఘ సర్వ సభ్య సమావేశంలో దానికి తుది రూపులు ఇవ్వబడగలవన్నారు వీరు.

ఉత్తర బొంబాయి నియోజకవర్గం నుండి శ్రీ కృపలానీ పోటీచేసిన ఆతనికి వ్యతిరేకంగా తమ పార్టీఅభ్యర్థిని నిలుపలేదన్నారు. మీనన్ విధానాలు జాతీయ వ్యతిరేకంగా ఉన్నాయని ఆతను ప్రతి అంశంలో దేశ ప్రయోజనాల కాపాడలేక పోతున్నారని విమర్శించారు.

నిక్కులపట్ల పక్షపాతం జరుపబడుతున్నదన్న ఆరోపణలవిచారణకు కేంద్ర ప్రభుత్వం ఏర్పరచనున్న కమిషన్‌ను గూర్చి ప్రశ్నించగా దానివల్ల జరిగేది ఏమీలేదని కాకాసింగ్ దీక్షావిరమణకు గాను అవకాశం ఆ విధంగా కల్పింపబడిందని చెప్పారు శ్రీ ఉపాధ్యాయ. ఇంకా దేశాన్ని భాషల వారిగా విభజించడం కూడదన్నారు. కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి పూర్తిగానిర్మూలింపబడాలని అభిప్రాయపడినారు

ఎన్నికల కమిటీ నేతలు!

హైదరాబాద్, అక్టో 11

రానున్న జనరల్ ఎన్నికలకు కురుక్షేత్ర సంగ్రామం జరుపవలసి అప్పుడు కొద్ది అంగబలం కల పాండవులు కౌరవులను గెలవలేనట్లే జనసంఘం మిగతా పక్షాలన్నింటిని గెలువాలని అఖిల భారత జనసంఘ కార్యదర్శి శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ ఇక్కడ చమత్కరించారు.

రైలుపట్టా నుండి 18 చీలల తొలగింపు

గూడ్సుబండికి కొద్దిలో ప్రమాదం తప్పిన వైనం

హైదరాబాద్, అక్టో 11

హైదరాబాద్-వాడీలైనుపై ఇక్కడికి పదిహేనుమైళ్ళ దూరంలో లింగంపల్లి-నవాబ్‌నగర్‌ల మధ్య ఒక రైలు పట్టాయొక్క 18చీలలు గత ఆదివారము ఊడదీయబడిఉన్నా ఒకగూడ్సు బండి ఇంజను డ్రైవరు తన బండి తీవ్రమైన కుదుపునకులోనుకాగా గమనించి వెంటనే బండిని ఆపి పట్టాలు తప్పిపోవడమునుండి కాపాడాడని ఆధికారికంగా తెలుస్తున్నది. పోలీసు దర్యాప్తు జరుగుతున్నది.

విదేశాంగ మంత్రుల స్థాయిలో అమెరికాతో చర్చలు

చైనాకు అభ్యంతరంలేదని మార్షల్ చెన్‌యీ అభిప్రాయం

పెకింగ్, అక్టో 11

ఉభయదేశాలమధ్య తీవ్రవాతావరణంలో సడలింపునకై విదేశాంగమంత్రుల స్థాయిలో అమెరికాతో చర్చలు సాగించడానికి చైనా ఇష్టపడగలదని చైనా విదేశాంగమంత్రి మార్షల్ చెన్‌యీ అన్నాడు.

సమయినా ఈచర్చలకు అభ్యర్థన అమెరికానుండి రావాలని కూడా మార్షల్ చెన్‌యీ పేర్కొన్నాడు. చైనా అమెరికా శిఖరాగ్రసమావేశపాళం అద్యతనభావిలో ఉన్నదా అన్న ప్రశ్నకే ఆయన పై జవాబు ఇచ్చాడు.

విపంచ యాత్రి సందర్భంగా రాయిటర్స్ జనరల్ మేనేజర్ వాల్టన్ ఏ. కోల్ చైనా విదేశాంగ మంత్రిని కలిసిన సందర్భంగా ఇష్టాగోష్ఠి చర్చలో ఈవిషయం వెల్లడయింది. వార్సాలో ఈవరకే రాయబారుల స్థాయిలో చర్చలుజరుగుతున్నాయనీ, జెనీవాలో ఉప విదేశాంగ మంత్రుల సమావేశాలు జరుగుతున్నాయనీ, ప్రతిపాదనవచ్చినట్లైతే విదేశాంగమంత్రుల స్థాయిలో చర్చలకుకూడా ఏమీఅభ్యంతరాలు లేవనీ చెన్‌యీ ఈ ఇష్టాగోష్ఠిలో వెల్లడించినట్లు తెలుస్తున్నది. ఇదివరకే అన్ని ప్రయత్నాలూ మేము చేసి ఉన్నాం కాబట్టి ఈపాటి కూడా మానుండే ప్రతిపాదన రావాలంటే మేము లొంగుబాటు చూపినట్లే కాగలదు కాబట్టి అందుకు మేము అంగీకరించలేమని చెన్‌యీ అన్నాడట. గత శతాబ్దాలుగా చైనా తరచు లొంగుతూ వచ్చింది యిక్కపై ఎవరికీ లొంగుబాటు చూపదని ఆతడు అన్నాడు.

ముందుగా విదేశాంగ మంత్రుల స్థాయిలో అన్నిప్రాతిపదిక ఏర్పాట్లూ జరుగనిదే రెండుమూడు రోజులు ఉభయదేశాలశిఖరాగ్రచర్చలూ జరుగడం అనికేవలం ప్రచారానికో ప్రదర్శనానికో మాత్రమే ఉపయుక్తంగా మారడం పనికివచ్చే వ్యవహారం కాదని చైనా విదేశాంగమంత్రి అభిప్రాయం వెల్లడించాడు.

చైనా కూడా అణ్వస్త్రాలను తయారు చేయడం ఇకరోజుల్లో పనిలేనిదిగా అమెరికా తదితర పాశ్చాత్య రాజ్యాలూ భయపడడం సహజమేననీ అయినా చైనా కూడా అణ్వస్త్రాలు తయారు చేసేట్లయితే యుద్ధ ప్రమాదం తగ్గిపోగలదనీ యిప్పుడున్న యుద్ధ వాతావరణం కొందరి వద్దనే అణ్వస్త్రాలున్న కారణముగానే ననీ కూడా మార్షల్ చెన్ ఈ అన్నాడు.

'ససురాల్' ఫిలిం రజతోత్సవం

హైదరాబాద్, అక్టోబర్ 11

హిందీ ఫిలిం "ససురాల్" రజతోత్సవ సందర్భంగా నేటి ఉదయము రాయల్ టాకీస్‌లో యేర్పరచబడిన కార్యక్రమానికి శాసన మండలి అధ్యక్షులు శ్రీ మాడపాటి హనుమంతరావుగారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాయల్ టాకీస్ ఉద్యోగులకు ప్రసాద్ ప్రొడక్షన్స్ మరియు ప్రకాశ్ పిక్చర్స్‌వారు ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ప్రకటించారు. శ్రీ హనుమంతరావుగారు తమ ప్రసంగంలో జనబాహుళ్యాన్ని ఆకర్షించ గలిగిన యిట్టి ఉత్తమచిత్రాన్ని నిర్మించిన ప్రసాద్ ప్రొడక్షన్సు వారిని అభినందించారు. దేశపు యితర రంగాలలోవలెనే స్వాతంత్ర్యం సిద్ధించిన దాదిగా ఫిలిం పరిశ్రమగూడా ప్రగతి చెందుతున్నదన్నారు. (స్వ. వి.)

స్థాయిలో

నగరంలో కేంద్ర ఉపమంత్రి శ్రీకొత్త రఘురామయ్య

హైదరాబాదు, అక్టో 11

ప్రస్తుతం నగరంలోఉన్న భారత ప్రభుత్వ రక్షణశాఖ ఉపమంత్రి శ్రీ కొత్త రఘురామయ్య యీవాళ ఏ.ఓ.సి. కేంద్రాన్ని ఇ.ఎమ్.ఇ.ప్రధాన కార్యస్థలంలోఉన్న సాంకేతిక సర్వీసుల శాఖను సందర్శించారు.

శ్రీ రఘురామయ్య రేపు సాయంత్రం 3 గంటలకు నిజామ్ కళాశాలలో నిజామ్‌కళాశాల అర్టు విద్యార్థుల సంఘానికి ప్రారంభోత్సవం జరుపుతారు.

మాసంలోగా తిరిగి ఎగుమతి అయ్యే వస్తువులపై ఆక్ట్రాయ్

రద్దుకు నగర కార్పొరేషన్ నిర్ణయం

హైదరాబాద్, అక్టో 11

నగరంలోకి దిగుమతిచేసిన వస్తువులను నెలలోగా తిరిగి ఎగుమతిచేసే యెడల వాటిపై ఆక్ట్రాయి సమ్ము విధించరాదని నిన్నటి నగర మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో సభ్యులు (కార్పొరేషన్‌కు) సిఫార్సు చేశారు. ఇందుకు అనుగుణముగా నిబంధనలను సవరించటం జరిగింది.

ఇక మీదట ప్రతి సమావేశంలో ఒక గంట ప్రశ్నోత్తరాలకు రెండు గంటలు చర్చనీయాంశాల పరిశీలనకు కేటాయించబడుతుందని మేయర్ ఒక ప్రకటన చేశారు.

నీటి సరఫరాశాఖను కార్పొరేషన్ త్వరలో తీసుకొంటుందని దానికి అస్తి అప్పులవివరాలు తేల్చటం మొదలైనవి పూర్తికావలసి వున్నాయని మున్సిపల్ కమిషనర్ శ్రీ లోకనాథం జమీల్ అహ్మద్ బేగ్‌కు తెలుపుతూ వివరాలు సిద్ధమైన తర్వాత ప్రభుత్వం యీ విషయమై నిర్ణయాలు చేస్తుందని ఆశిస్తున్నట్లు వివరించారు.

మరుసటి సమావేశానికి వాయిదా వేసిన 27 చర్చనీయాంశాలలో 13 అంశాలపై నిన్న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో సభ్యులు నిర్ణయాలు తీసుకొన్నారు. తరచూ జరిగే ప్రత్యేక సంఘ సమావేశాలను గురించి తరచూనిర్వహించే తనిఖీలను గురించి రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు తెలిపిన సూచనలపై సభ్యులు చర్చ జరిపి వాటిని గురించి తమఅభిప్రాయమును తర్వాత తెలుపుటకునిశ్చయించారు.

నగరంలోని ప్రతిమున్సిపల్ నియోజకవర్గంలోను ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించాలని షేక్ మహ్మద్ చేసిన ప్రతిపాదనకు సమావేశంలోని అత్యధికసభ్యుల ఆమోదం లభించింది. కాంగ్రెసు పక్షనాయకుడు శ్రీ అలీ

(4 వ పేజి చూడుడు)

స్పెయిన్‌చే సిరియా గుర్తింపు

మాడ్రిడ్, అక్టో 11

సిరియా అరబ్ రిపబ్లిక్ ప్రభుత్వాన్ని స్పెయిన్ గుర్తించి దౌత్య సంబంధాలకు ఏర్పాటు నిర్ణయించుకుంది

అస్సాం కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ నుండి ఇద్దరి తొలగింపు

గౌహతి, అక్టోబర్ 11

అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటినుండి అస్సాం మాజీఆర్థికమంత్రి శ్రీ దేవేశ్వర్ శర్మ రాజీనామా ఇచ్చారు.

కాంగ్రెస్ అధ్యక్షుని ఆదేశంపై ఈ రాజీనామా ఇవ్వడం జరిగింది.

1959 అక్టోబర్ లోనౌగాంగ్ నుండి జరిగిన ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టబడిన దేవకాంత బారువా ఓడిపోవడానికి కారణాల విచారించుటకు నియమించబడిన శ్రీ బార్లింగె రిపోర్టుఆధారంగా కాంగ్రెస్ అధ్యక్షులు ఈచర్య తీసుకున్నారు. దేవేశ్వరశర్మ స్థానే ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటిలోకి అస్సాం స్పీకర్ మహేంద్ర మోహన్ చౌదరి తీసుకోబడినాడు. శ్రీ శర్మ ఎ.ఐ.సి.సి సభ్యత్వము ప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గం అసెంబ్లీ సభ్యత్వానికి గూడా రాజీనామా ఇచ్చారు.

కాంగ్రెస్ ఆదేశానికి భిన్నముగా కాచార్ జిల్లాలో భాషా ఉద్యమంలో పాల్గొన్నందుకు అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటిలోని మరో సభ్యుడు నందకిశోర్ సింఘపై క్రమశిక్షణ చర్య తీసుకోబడింది. ఈతని స్థానే ఎలక్షన్ కమిటిలోకి చిత్రసింగ్ తరణ్ తీసుకోబడినాడు.

నీలకంఠం నరసిములు
N.N CLOTH MERCHANT
సిల్క్ మరియు చేనేత బట్టల దుకాణం
కోఠి, సుల్తాన్ బజారు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్.
A.A
దసరా మరియు దీపావళికి
గొప్ప స్టాకు వచ్చినది.
అన్నిరకముల చీరెలు, ఇతర దుస్తులు.
ఫోన్: 4907 — టెలిగ్రామ్: కాంత్ — స్థాపన: 1914

బ్రిటన్‌లో గాంధీ జయంతి

లండన్, అక్టోబర్ 11

మాంచెస్టర్ భారతీయ సంఘం, భారతీయ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన మహాత్మాగాంధీ జయంత్యుత్సవము జరిగినది. కామన్వెల్తు పార్లమెంటరీ సంఘం సమావేశానికి హాజరయ్యే సందర్భంలో లండన్‌కు వెళ్లిలోక్‌సభ సభాపతి శ్రీ ఎం. అనంతశయనం అయ్యంగార్ కూడా మాంచెస్టర్ ఉత్సవాలలో పాల్గొన్నారు. బ్రిటన్‌లో శాశ్వతాధిక భారత హైకమీషనరు శ్రీ టి.ఎన్. కౌల్, మాంచెస్టర్ డిప్యూటీ లార్డు మేయర్, పార్లమెంట్ సభ్యుడు శ్రీ లెస్లీ లివర్ సభకు వచ్చిన వారిలో ఉన్నారు.

వర్తమాన ప్రపంచంలో గాంధీజీ ప్రబోధాల ప్రాముఖ్య ప్రయోజనాలను శ్రీ అనంతశయనం అయ్యంగార్ వివరించినారు. ప్రతి భారతీయుడు "శాంతి దూతగా" వ్యవహరించాలన్నారు.

బ్రిటన్‌లోని భారతీయవిద్యార్థులూ వ్యాపారస్థులూ ఉభయదేశాలమధ్య సద్భావం పెంపొందించే అనధికార రాయబారులుగా వ్యవహరించాలన్నారు శ్రీ కౌల్.

1930 తరువాతి సంవత్సరాలలో మాంచెస్టర్‌కు గాంధీజీ రాక సంగతిని శ్రీ లివర్ స్మరించి అంతటి మహనీయుని సంస్మరణ సభలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు.

వరద నివారణ చర్యలకై ప్రాంతీయ గోష్ఠులు

న్యూఢిల్లీ, అక్టో 11

వరదల సమస్యను సర్వంకషంగా చర్చించి, ఇకముందు నిర్వహించే కార్యక్రమాలకు తగు విధానాలనూ, ప్రాధాన్యతనూ నిర్దేశించేందుకు అయిదు ప్రాంతీయ గోష్ఠులను యేర్పాటు చేయవలసిందని కేంద్ర ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి మంత్రి, శ్రీ హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ఈ ప్రాంతీయ గోష్ఠులను క్రింది విధంగా యేర్పాటు చేయవచ్చునని శ్రీ హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక లేఖలో తెలియజేశారు:

బ్రహ్మపుత్రా ప్రాంతం (పశ్చిమ బెంగాలు, అస్సాం); గంగా ప్రాంతం (పశ్చిమ బెంగాలు, బీహారు, ఉత్తర ప్రదేశ్, పంజాబు); వాయవ్యప్రాంతం (పంజాబు, జమ్ము-కాశ్మీరు, గుజరాతు, రాజస్థాన్); మధ్యభారత ప్రాంతం (ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్); దక్షిణ ప్రాంతం (మైసూరు, మహారాష్ట్ర, మద్రాసు, కేరళ).

ఈఅయిదు ప్రాంతీయ గోష్ఠులనూ వరుసగా పశ్చిమ బెంగాలు, ఉత్తర ప్రదేశ్, పంజాబు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించవచ్చును.

ఈ గోష్ఠుల యేర్పాటును గురించి తమ అభిప్రాయాలను నవంబరు నెల మధ్యలోగా తెలియజేయవలసిందని రాష్ట్రప్రభుత్వాలను కోరారు.

డాక్టర్ లుఖ్మాన్‌గారి నుండి

నేను స్వంతం తీసుకున్న కంటి జోడువల్ల పొందిన అనుభవము వారి సామర్థ్యమునకు నిదర్శనము.

మదదుగార్ కోత్వాల్ (చార్‌మినార్ ప్రాంతం) శ్రీ ఆర్ పద్మారెడ్డిగారిట్లు వ్రాయుచున్నారు. లోగా నేను నా కంటి పరీక్ష అనేక సమర్థులగు నేత్రవైద్యులచే పరీక్షింపజేసితిని. వారి సలహాపై అనేక కంటి జోళ్ళు వాడితిని కాని నాకు నమ్మకమని పించలేదు. తుదకు నేను డాక్టర్ లుఖ్మాన్‌గారి నూతన షోరూం "జనతా ఆప్టిక్స్" నిజాం షాహి రోడ్‌కుపోయి పరీక్ష చేయించితిని. వారు ఎంపిక చేసిన కంటిజోడు వాడగా చాల శ్రేష్ఠమైనవిగా అనుభవము పొందితిని. నా కనువగునవి లభించినందుకు చాల సంతసమైనది. డాక్టర్‌గారి నైపుణ్యము చాల గొప్పది.

నేనే కాదు.

నా కూతురు డాక్టర్ లుఖ్మాన్‌గారిచే తన నేత్రపరీక్ష చేయించుకొని వారిచ్చిన కంటిజోడు వాడగా చాల దినములనుండి గల తలనొప్పి నివారణ అయినది. డాక్టర్ లుఖ్మాన్‌గారి సలహాలకు కృతజ్ఞతలు. వారి విద్యలో ఇతోధిక అభివృద్ధికై ఆకాంక్షిస్తున్నాను.

తేది. 12-9-61

సం॥ ఆర్. పద్మారెడ్డి.

మీరును తమ కండ్ల రక్షణకై తగు కండ్లజోడు పొందుటకు దేశపు ప్రఖ్యాత డాక్టర్ సలహా పొందండి.

(సంస్థ)

ప్లవ సం॥ ఆశ్వయుజ శు॥ తదియ రా2- 10 విశాఖ తె 4 42 ఉ వ 9-44 మొ: 11-24 వరకు (శాలివాహన శకము: 1883) 12-10-1961 గురువారము

"జ్ఞానమ యింధనముగ విజ్ఞానాగ్నిం బ్రబలఁ జేయ జరయు మరణమున్ నానా విధ దుఃఖంబులు లేని యమృత మధురంబు లెసైన తోచున్."

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

12 అక్టోబర్ 1961

గురు వారము

స్వచ్ఛంద ఆరోగ్య సేవా కేంద్రములు

—(0)—

మన దేశము అనేక సంవత్సరములనుండి యెదుర్కొనుచున్న తీవ్ర సమస్యలలో నిరక్షరాస్యత, అజ్ఞానము, అనారోగ్యము ప్రముఖమైనవి. పల్లె ప్రాంతములయందు అవిద్య, అనారోగ్యము పట్టణ ప్రాంతములకంటెను యింకను తీవ్రతరముగా నున్నవని చెప్పవచ్చును. సామాన్యముగా, ఆర్థికముగా వెనుకబడిన దేశములలో యీ సమస్యలు సహజముగనే ఉత్పన్నమగుచుండును. స్వాతంత్ర్యానంతరము మనదేశములో విద్య, వైద్య సౌకర్యములను కలిగించుటకు మహత్తరమైన పథకములద్వారా తీవ్ర ప్రయత్నములు జరుపబడుచున్నవి. పంచవర్ష ప్రణాళికల ద్వారా సమాజ వికాస కేంద్రాలను స్థాపించి పల్లె ప్రాంతాలయందు విద్యా, వైద్య సదుపాయములను కలిగించుటకు ప్రశంసనీయమైన కృషి జరుగుచున్నది. గడచిన పది సంవత్సరములలో అక్షరాస్యుల సంఖ్యలో జరిగిన అభివృద్ధిని, సగటు జీవన ప్రమాణములో కలిగినమార్పును గమనించినపుడు ప్రణాళికల ద్వారా జరుగుచున్న కృషి సఫలమగుచున్నదని తెలియగలదు. మదరాసులో యిటీవల ఒక సందర్భములో ప్రధాని శ్రీ జవహర్‌లాల్ వివరించినట్లు సాంఘిక సేవారంగములో మిక్కిలి ప్రాధాన్యత వహించునవి విద్య, ఆరోగ్యము. విద్య, ఆరోగ్య సౌకర్యాలు దేశములోని ప్రతి పౌరునికి ఉచితముగ కల్పించవలసి యుండును. అట్టి శ్రేయోరాజ్యస్థాపన కొరకై మన ప్రణాళికలు ఉద్దేశించబడినవి. ఇంతవరకు జరిగిన పురోగతిని పరిశీలించినపుడు కొద్ది సంవత్సరములలోనే ప్రతి పౌరునికి ఉచితవిద్య, వైద్య సౌకర్యములు కల్పించు పరిస్థితి మన దేశమున యేర్పడగలదని గట్టిగా విశ్వసించవచ్చును.

క్షణక్షణము పెరుగుచున్న జనసంఖ్యను దృష్టిలో పెట్టుకొనినపుడు కేవలము ప్రభుత్వము జరుపుచున్న కృషి మాత్రమే సరిపోదను విషయము స్పష్టముగాగలదు. ప్రజలుకూడ కొంతవరకు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు పూనుకొనవలసి యుండును. ప్రత్యేకముగా సాంఘిక సేవకులు సాంఘిక సేవా కేంద్రాలను స్థాపించుటకు ప్రయత్నించుట సమంజసముగా నుండగలదు. ఇటీవల మదరాసులో శ్రీ నెహ్రూ ప్రారంభోత్సవము కావించిన స్వచ్ఛంద ఆరోగ్య సేవాకేంద్రమును సాంఘిక సేవకుల కృషికి నిదర్శనముగా పేర్కొనవచ్చును. లాభదృష్టి లేకుండ వైద్య సౌకర్యాలను, వైద్య విద్యా సదుపాయాలను, వైద్య పరిశోధన వసతులను కలిగించుటకు యీ స్వచ్ఛంద ఆరోగ్య సేవాకేంద్రము స్థాపించబడినది. తక్కువ ఆదాయము కలవారికి ఉచితవైద్య సౌకర్యాలను యీ కేంద్రము కలిగించగలదు. ఒక విధముగ యీ ప్రయత్నమును ఆరోగ్య, వైద్య రంగములో సహకార ఉద్యమ చిహ్నముగ పేర్కొనవచ్చును. సహకార దృష్టితో యిట్టి సంస్థలు స్థాపించబడినచో అద్భుతమైన అభివృద్ధి జరుగుటకు అవకాశముండగలదు. ఇది ఆహ్వానించదగిన ప్రయత్నము. ఇతర రాష్ట్రములలో కూడ స్వచ్ఛంద ఆరోగ్య కేంద్రాలను స్థాపించుటకు ప్రయత్నములు జరుగవలసియుండును. మదరాసులో స్థాపించబడిన కేంద్రము విజయవంతముగ నడచినచో యితర రాష్ట్రములకు తప్పకుండ ఆదర్శవంతము కాగలదని చెప్పవచ్చును. వైద్య సౌకర్యాలే కాకుండా మన దేశములో వైద్యులసంఖ్య, వైద్య పరిశోధన కేంద్రాలు చాలా తక్కువ. స్వచ్ఛంద ఆరోగ్య సంస్థలు యీ లోటును పూరించుటకు సంకల్పించుట ప్రశంసనీయము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు యిట్టి సంస్థలకు తగిన సహాయమును, ప్రోత్సాహమును యివ్వగలవని ఆశించుచున్నాము.

హయిద్రాబాద్ ఆంధ్ర మహిళామహాసభ భవనాలు

విద్యానగర్ సమీపంలో శంకుస్థాపన ఏర్పాట్లు

హైద్రాబాద్, అక్టోబరు 11

విద్యానగర్ రైల్వేహాల్టు వెనుక గల నాల్గు ఎకరాలభూమిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం హైద్రాబాదులోని ఆంధ్ర మహిళాసభ భవనాలకై కేటాయించింది.

ఈ స్థలంలో అక్టోబరు 22న ముఖ్యమంత్రి శ్రీడి సంజీవయ్య శంకుస్థాపనోత్సవం జరుపుతారు. అఖిల భారత చేతివృత్తులబోర్డు అధ్యక్షురాలుశ్రీమతి కమలాదేవి ఛట్టోపాధ్యాయ అదేరోజున ప్రాంతీయచేతివృత్తుల శిక్షణా సంస్థ భవనాలకు కూడా శంకుస్థాపన చేస్తారు.

అడ్వర్టయిజింగులో సాంఘిక ప్రాధాన్యం

ఉండాలని అమెరికన్ ప్రముఖుని ఉద్బోధ

మద్రాసు, అక్టోబర్ 11

మార్కెటింగులో అమెరికన్ నిపుణుడైన డాక్టర్ గార్డాన్ బి బార్నీవాల్ ఇక్కడ మాట్లాడుతూ, అడ్వర్టయిజింగు విద్యా బోధక విషయముగా ఉండేటట్లు చేయాలన్నారు.

మద్రాసు అడ్వర్టయిజు మెంటు క్లబ్బులో ఇటీవల ఆయన ఉపన్యసిస్తూ, మార్కెటింగు విషయాలలో అడ్వర్టయిజర్లు సముచిత పాత్ర వహించాలనీ ఈదేశంలో అడ్వర్టయిజింగుకు చక్కని వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నించాలనీ చెప్పారు. మార్కెటింగ్ బాగా ఉన్నప్పుడే ఉత్పత్తులు పెరుగుతాయనీ, ప్రజల జీవన ప్రమాణము వృద్ధి అవుతుందనీ ఆయన అన్నారు.

అడ్వర్టయిజర్లు మార్కెటింగు సలహాదారులుగా ఉండే సామర్థ్యం సంపాదించి, వ్యాపార సాంఘిక విలువల పోషణకు బాధ్యత వహించాలని శ్రీ బార్నీవాల్ చెప్పారు.

అయిన్ని సభా సదులకు శ్రీ ఎస్. రామచంద్రన్ పరిచయం చేశారు శ్రీ ఆర్.కె. స్వామి అభినందనాలు తెల్పారు.

నవరాత్రికి ప్రత్యేక కార్యక్రమాలు

ఆకాశవాణి హైద్రాబాదు కేంద్రంనుండి

హైద్రాబాదు, అక్టో 11

ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంవారు నవరాత్రి ఉత్సవాల సందర్భంలో అనేక కర్ణాటక సంగీత కార్యక్రమాలను ప్రసారం చేయనున్నారు.

అక్టోబర్ 19వ తేదీరాత్రి 9-45 గంటలకు ఖైరతాబాదులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో శ్రీటి విశ్వనాథన్ ఫ్లూట్ (వేణువు) కచ్చేరీ, శ్రీ టి.రంగనాథన్ మృదంగం వాయిస్తారు. అక్టోబరు 15వతేదీరాత్రి 9-15 గంటలకు హిమాయత్‌నగర్‌లోని ఉర్దూహాలులో శ్రీ హెరేటి వెంకటేశ్వర్లు గాత్ర సంగీత కచ్చేరీ. ప్రక్క వాద్యాలు శ్రీ అన్నవరపు రామస్వామి. వయొలిన్, శ్రీ దండమూడి రామమోహనరావు, మృదంగం, అక్టోబర్ 16వతేదీ రాత్రి 7-30 గంటలకు ఖైరతాబాదులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరు భవనంలో శ్రీ వింజమూరి వరదరాజ అయ్యంగార్ ఆధ్వర్యంక్రింద ఆకాశవాణి వాద్యబృందం కార్యక్రమము, దానితర్వాత శ్రీరంగంగోపాలరత్నం గాత్రకచ్చేరీ, ప్రక్క వాద్యాలు శ్రీ నేతి శ్రీరామశర్మ వయొలిన్, శ్రీ అట్లూరి వెంకటేశ్వరరావు, మృదంగం, అక్టోబర్ 17వ తేదీరాత్రి 9-30 గంటలకు ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంలో శ్రీ వాసా కృష్ణమూర్తి వీణకచ్చేరీ. ప్రక్క వాద్యం శ్రీ వి. కమలాకరరావు మృదంగం. అక్టోబరు 18వ తేదీరాత్రి 9-45 గంటలకు హిమాయత్ నగర్‌లోని ఉర్దూహాలులో శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు శ్రీ ద్వారం సత్యనారాయణరావుగార్ల వయొలిన్ కచేరీ, ప్రక్క వాద్యాలు శ్రీ వెల్లూరు రామభద్రన్ మృదంగం, శ్రీ ఆర్. ఎన్. కృష్ణమూర్తిరావు ఘటం.

పశ్చిమబెంగాల్‌లో వామపక్షాల ఫ్రంట్ ఏర్పాటు

కలకత్తా, అక్టో 11

రానున్న ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని 252 శాసనసభా స్థానాలలో 185 స్థానాలకు, 36 లోకసభా స్థానాలలో 24 స్థానాలకు కమ్యూనిస్టుపార్టీ రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ, బోల్షివిక్ పార్టీలు ఒక ఐక్య ఫ్రంటుగా ఏర్పడి పోటీచేస్తాయి. ఈ పార్టీలు కలిసిన ఐక్యఫ్రంట్ నిన్న తమ అభ్యర్థుల జాబితాలు ప్రకటించాయి. అభ్యర్థులకు స్థానాల కేటాయింపు విషయమయిగల భేదాభిప్రాయాలతో తమతోఫార్వర్డ్‌బ్లాకు-మార్క్సిస్టు ఫార్వర్డ్ బ్లాకులు కలసి రాకపోవడం దురదృష్టకరమని ప్రకటింప బడింది కూడా.

గత ఎన్నికలలో ఫార్వర్డ్ బ్లాకు, మార్క్సిస్టు ఫార్వర్డ్‌బ్లాకు, పి. ఎస్. పిలు ఒక ఫ్రంట్‌గా పనిచేశాయి. ఈసారి పి. ఎస్. పి. విడిగానే ఉండిపోతున్నది.

బిహార్ మృతుల సంఖ్య 908కి పెరుగుదల

పాట్నా, అక్టో 11

బిహార్ రాష్ట్రంలోని మాంఘిర్, భాగల్పూర్, పాట్నా, గయా, సంథాల్ పరగణాలు, పూర్ణియా జిల్లాలలో యిటీవలి భారీవర్షాలు, వరదల వల్ల చనిపోయినవారిసంఖ్య 908కి పెరిగింది. ఖర్గపూర్ సరస్సుకట్టతెగినప్పటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించినవారిసంఖ్య 60 వరకూ ఉందని ఆ సరస్సుప్రాంతానికి మొట్టమొదటిగా చేరుకున్న బిహార్ రాష్ట్ర వెనుకబడినతరగతుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ రామచంద్ర ప్రసాద్ తెలియజేశారు.

తొట్టాడం అగ్రహారం ఎస్టేటు

హైద్రాబాద్, అక్టో 11

తొట్టాడం అగ్రహారం ఇనామ్ ఎస్టేటుకు సంబంధించి, ఆడ్వాన్సు నష్టపరిహారం క్రింద 1959 సెప్టెంబరు 18వ తేదీన రూ. 812 లనూ, 1960 మార్చి 10వ తేదీన రూ. 5,109 లను ప్రభుత్వం తరపున విశాఖపట్నం జిల్లా జడ్జి, ఇ ఏటి. వద్ద తాను డిపాజిట్ చేసినట్టు పెటిల్మెంట్స్ సర్వే, ల్యాండ్ రికార్డుస్ డైరెక్టర్ ప్రకటిస్తున్నాడు.

పశువులకు గడ్డికంచె ఉచిత వినియోగం

కూకట్‌పల్లి, అక్టో 11

కూకట్‌పల్లి సహకార పాల సరఫరా సంఘము (హైద్రాబాద్ వెస్టు తాలూకా) వారు గ్రామము లోని ప్రభుత్వపు ఆటవిక శాఖావారి నుండి చేలములో తీసుకున్న గడ్డికంచె గ్రామ ప్రజలందరి పశువులను ఉచితముగా మేపుకొనుటకు నిర్ణయించినట్లు తెలుపబడుతున్నది.

గాంధీజీలోని త్రికరణ శుద్ధి

సెక్రటేరియట్ కల్చరల్ అసోసియేషన్ సభలో మంత్రి చంద్రమౌళి ప్రసంగం

(ఒ. వి.)

హైదరాబాద్, అక్టో 11

ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతిక సంఘంవారు గాంధీ జయంతిని వైభవోపేతంగా జరిపారు. నాటి సభకు సహకార, దేవాదాయాలశాఖా మాత్యులు శ్రీ కల్లూరి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. శ్రీ యన్ రమేశన్ ఐ. ఏ. యస్. ఉపన్యసించారు. శ్రీ చంద్రమౌళి తమఅధ్యక్షోపన్యాసంలో మహాత్ముడు ఆలోచించేది, చెప్పేది, చేసేది ఒకే విధంగా ఉండేదనీ అందులో వైరుధ్యం ఎంతమాత్రం ఉండేదికాదనీ, అదే ఆయనలోని గొప్పవిశేషమనీఅన్నారు. దేశాభ్యున్నతిని సాధించి, శాంతి పథంలో పురోగమించాలంటేమహాత్మునిఅడుగుజాడలలోనే మనమంతానడవాలని ప్రబోధించారు.

తరువాత, శ్రీ రమేశన్ మాట్లాడుతూ యిలాఅన్నారు "గాంధీజీ ప్రవిషయాన్నయినాతుష్ణంగాతెలిసికొని మాట్లాడేవారు. వారి అంతరాత్మ ప్రబోధించినట్లుగా ప్రతి విషయంలోనూ స్వతంత్రంగా వ్యవహరించేవారు. అందుచేతనే కోటాను కోట్ల భారతీయులకు ఆయన నాయకత్వం వహించ గలిగారు. మహాత్ముడు ఏ క్షణంలో ఏమి చేయాలను కొనేది. ఏపద్ధతిలో కార్యక్రమాన్ని నడిపిస్తారనేది ఆయన సన్నిహితులకు కూడా తెలిసేదికాదు. గాంధీజీ స్వార్థాన్ని పరిత్యజించడం వల్ల "దైవస్వరూపుడుగా రూపొందగలిగాడు" వారికాలఇలాఅన్నారు." గాంధీజీవంటి మహాపురుషుడు మనభారతదేశంలోజన్మించినందులకు మనమంతా గర్వించాలి కాని అట్టిమహాపురుషుడు, జాతిపిత మహాప్రవక్త, అహింసామూర్తి శాంతిదూతఅయిన గాంధీజీని మన భారతీయుడే మరతుపాకికి బలిచేయడంవల్ల మిగతా ప్రపంచప్రజల దృష్టిలో మనంభావితరాలలో గూడా అల్పులుగా పరిగణింప బడుదుము"

సభముగిసినతరువాత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీమతి యస్. విజయలక్ష్మి కన్నారావు జాతీయగీతాలను పాడారు. జేబీకార నృత్యం, ప్రతిభావంతమైన రాజస్థాన్ ట్రూప్‌వారి "బొమ్మలాట" జరిగాయి న్యాయశాఖా కార్యదర్శి శ్రీ జె వీరాస్వామి జేబీకారకు ఒక వెండి కప్పును బహూకరించారు.

సచివాలయ సాంస్కృతిక సంఘ కార్యదర్శి శ్రీ వి. 'విరయ్య చౌదరి వందన సమర్పణచేశారు. "జనగణమన" గీతంతోసభ సమాప్తమయింది.

వర్తకులపట్ల ప్రభుత్వపు చిన్నచూపు

ఒంగోలు వర్తక సంఘమువారి విచారము

(మా. వి.)

ఒంగోలు, అక్టోబరు 11

ఈనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వర్తకులపట్ల చిన్నచూపు చూచుచున్నదనీ, వర్తకులకు మిగుల అపకారము చేయగలబిల్లులన్నీ ప్రవేశ పెట్టుచున్నారని, గాంధీజయంతి సందర్భంలో ఇక్కడజరిగిన ఒక బహిరంగ సభలో పలువురు ప్రముఖులు తమ విచారము వెలిబుచ్చారు. ఈ సభకు శ్రీనున్నా పున్నారావు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు నందిపాటి వేంకటనారాయణ అన్నవరపు వేంకటసుబ్బారావు గాంధీజీ ఆశయములను వివరించుచూ నేటి ప్రభుత్వము వారు వర్తకులపై విధించుచున్న పన్నులవలన వారికి జరుగుహానిని వివరించారు.

ఉదయం గాంధీజీ, పొట్టి శ్రీరాములుగారల ఫొటోలతో పూలరేగింపు జరిగినది. మాజీ పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ టి. లక్ష్మీనరసింహస్వామి జండా ప్రతిష్ట గావించారు.

ఖంపాలకు చైనాదళాలకు మధ్య సంఘర్షణ: 60మందిమృతి

సిమ్లా, అక్టో 11

సెప్టెంబరాఖరు వారంలో పశ్చిమ టిబెట్‌లోని పామిర్ ప్రాంతంలో చైనాదళాలకు ఖంపాలకుమధ్యజరిగిన ఒక సంఘర్షణలో దాదాపు 40 ఖంపాలు, 20చైనాసైనికులు చనిపోయారని తెలియవచ్చింది.

పశ్చిమ టిబెట్‌లో ఇంకా 2 వేల మంది ఖంపాలు చైనా పరిపాలనకు లోబడకుండా ఎదురు తిరుగుతూనే ఉన్నారు.

తొర్రూరులో క్రీడల పోటీలు

తొర్రూరు, అక్టో 11

వరంగల్ జిల్లా మానుకోట తాలూకా గ్రామమందు "మిత్రమండలి"(ఫ్రెండ్స్‌క్లబ్) వారిచే క్లబ్ వార్షికోత్సవ సందర్భమున (30 సెప్టెంబరునుండి 2 అక్టోబరువరకు) ఫిర్కా టోర్నమెంటు జరిగి వివిధ ఆటలపోటీలలో గెలుపొందిన వారికి విలువగల నిల్వరుకప్పులు బహూకరింప బడినవి.

మార్కెట్ కమిటీ సిబ్బందికి పే కమిటీ స్కేల్స్‌కై అభ్యర్థన

ఖమ్మం, అక్టోబరు 11

ఖమ్మం మార్కెటు కమిటీ అధ్యక్షులు శ్రీ యస్. నరసింహారావు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు:

1958 నవంబరు మాసములో రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులందరికీ పే కమిటీ నిర్ణయించిన వేతనపు స్కేల్స్ అమలులోకి వచ్చినవి. ఈ విధానమువల్ల రాష్ట్రప్రభుత్వోద్యోగులకూ మరియు స్థానిక సంస్థలలో పనిచేయు ఉద్యోగులకూ ఎంతో మేలు జరిగిందని చెప్పవచ్చును. దాదాపు మూడు సంవత్సరముల నుండి ప్రభుత్వోద్యోగులు మరియు స్థానిక సంస్థల ఉద్యోగులు పే కమిటీ స్కేల్స్‌వల్ల లాభం పొందుతూవుంటే, తెలంగాణా మార్కెటు కమిటీ ఉద్యోగులకు యింతవరకూ ఇట్టి స్కేల్స్ వర్తింపజేయకపోవడం విచారకరం.

రాష్ట్రప్రభుత్వోద్యోగుల వేతనాల స్కేల్స్‌తోగానీ, స్థానిక సంస్థలఉద్యోగుల వేతనాల స్కేల్స్‌తోగానీ పోల్చి చూచినట్లయితే మార్కెటు కమిటీ ఉద్యోగుల స్కేల్స్ చాలా తక్కువ. సుమారు ఒక సంవత్సరం క్రితం తెలంగాణా మార్కెటు కమిటీలచే పే కమిటీ గ్రేడ్స్ విషయమై, రాష్ట్ర మార్కెటింగు కార్యాలయం అభిప్రాయ సేకరణజరిపింది రాష్ట్రప్రభుత్వోద్యోగులు మరియు స్థానిక సంస్థల ఉద్యోగుల మాదిరిగానే మార్కెటు కమిటీ ఉద్యోగులకు కూడా పేకమిటీ స్కేల్స్ వెంటనే వర్తింపజేయటము న్యాయమని తెలంగాణా మార్కెటు కమిటీలు అభిప్రాయాన్ని తెలిపివున్నాయి తదుపరి మార్కెటుకమిటీ ఉద్యోగులకు పేకమిటీస్కేల్స్‌వర్తింపజేయుటకు అనుమతింపవలసినదిగా రాష్ట్రకార్యాలయం డైరెక్టొరేటును కోరి, డైరెక్టొరేటు అనుమతి కూడా పొందినట్లు గతనాలుగైదు మాసముల నుండి వినవస్తున్నదేగాని యింతవరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. ఈ జాప్య విధానానికి ముఖ్యకారణం మార్కెటింగుకు ప్రత్యేకశాఖలేకపోవడము, మార్కెటింగు వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధి చెందుటకు తప్పకుండా ప్రత్యేకమార్కెటింగుశాఖనువీలైనంత త్వరలో ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది.

గ్రోమికో - మాక్మిలన్ మంతనాలు

పెద్దప్రగతి ఏమీసాధించబడలేదని బ్రిటిష్ ప్రతినిధి అభిప్రాయం

లండన్, అక్టో 11

రష్యా విదేశాంగమంత్రి అండ్రీ గ్రోమికో, బ్రిటిష్ ప్రధాని హెరాల్డు మాక్మిలన్‌లు జర్మనీ సమస్యపై నిన్న 105 నిమిషాలపాటు మంతనాలు సాగించారు. అపరిష్కృత సమస్యల శాంతియుత పరిష్కారానికై అగ్రరాజ్యాలు వీలున్నంతకృషి సాగించాలని అందరూ అభిప్రాయపడుతున్నట్లు వాషింగ్టన్‌లోను, ఇక్కడా తాను జరిపిన మంతనాలవల్ల అవగాహన చేసుకున్నానని గ్రోమికో అన్నారు. ఈ మంతనాల ఫలితాలను వెంటనే కొలవడంగాని తూచడంగాని సాధ్యం కాకపోయినా ఇటువంటి మంతనాలు ఎప్పుడూ ప్రగతి సాధకాలే అని గ్రోమికో ఒకప్రశ్నకు జవాబిచ్చాడు.

గ్రోమికో నిన్న తన మంతనాల సందర్భంగా రష్యా ప్రధాని క్రుశ్చేవ్ నుండి ఒక సందేశాన్ని మాక్మిలన్‌కు అందజేశాడని తెలుస్తున్నది.

నిన్నటి చర్చల అనంతరం పరిస్థితిలో ఏమీ మార్పులేదని ప్రగతి ఏమీ కానరావడంలేదనీ ఒక బ్రిటిష్ ప్రతినిధి అభిప్రాయం వెల్లడించాడు. గ్రోమికో నిన్న బ్రిటిష్ విదేశాంగ మంత్రి లార్డు హోంను కూడా కలిశాడు.

వికారాబాద్ సమితి ఉపాధ్యాయ సంఘం

వికారాబాద్, అక్టో 11

వికారాబాద్ సమితి ఉపాధ్యాయ సంఘము ఎన్నికలు యీనెల 8వ తేదీన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శ్రీ యస్. సుబ్రహ్మణ్యము (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి) అధ్యక్షతన జరిగి ఈ క్రింది ఉపాధ్యాయులు ఎన్నిక అయినారు:

టి. నారాయణాచారి (అధ్యక్షుడు), డూండేరావు జాదవ్ (ఉపాధ్యక్షులు), ఎ.యల్.యన్. స్వామి (కార్యదర్శి), యస్. బుచ్చప్ప (సంయుక్త కార్యదర్శి), యస్. కమలయ్య (కోశాధికారి).

విమాన ప్రమాదములో 8 మంది మృతి

వాలెటా (మాల్టా), అక్టో 11

నిన్న లిబియాలోని ఎల్‌ఆడెం విమానాశ్రయం నుండి బయలు దేరిన రాయల్ ఏర్ ఫోర్స్ వెస్టింగ్స్ ట్రాన్స్‌పోర్టువిమానము ప్రమాదానికి గురైనందున 8 మంది చనిపోయారనీ 19 మంది గాయపడ్డారనీ నేడు వార్త అందింది.

మూడు న్యూస్‌ప్రింటు ఫ్యాక్టరీల స్థాపన

కరద్, మొరాదాబాదుల్లోను పంజాబ్‌లోను ఏర్పాటు కాగలవని శ్రీమసూభాయిషా

అహ్మదాబాదు, అక్టో 11

తృతీయ ప్రణాళికా కాలంలో 3 న్యూస్ ప్రింట్ కాగితపు కర్మాగారాలు నెలకొల్పబడగలవని కేంద్ర పరిశ్రమలశాఖమంత్రి శ్రీ మానూభాయిషా నిన్న యిక్కడ వెల్లడించారు.

ఈ కర్మాగారాల్లో ఒక్కొక్కదానిలో ఏడాదికి 60 వేల టన్నుల న్యూస్ ప్రింటు ఉత్పత్తి కాగలదట. ఈ ఫ్యాక్టరీలు కరద్, మొరాదాబాద్‌లలోను పంజాబ్ రాష్ట్రంలోను ఏర్పాటవుతాయని కూడా ఆయనవెల్లడించారు.

నిన్న సాయంత్రం గుజరాత్ కామర్సుఛేంబర్ సమావేశంలో మాట్లాడుతూ శ్రీమానూభాయిషా ప్రస్తుత ప్రణాళికా కాలంలో ప్రభుత్వాధ్వర్యాన నడుస్తున్న నేపా న్యూస్ ప్రింటు ఫ్యాక్టరీ ఉత్పత్తి శక్తిరెట్టింపు చేయబడుతుందనీ మూడో ప్రణాళికాకాలానికి ఇండియాలో 2 లక్షల 40 వేల టన్నుల న్యూస్ ప్రింటుతయారు కాగలదనీ తెలిపారు.

మూడో ప్రణాళికలో జీవితావసరమైన ప్రధాన ప్రాతిపదిక రసాయనాలు ఇండియాలోనే ఉత్పత్తి కాగలవని కూడా ఆయన తెలిపారు.

భావ్‌నగర్‌లో ఆక్సిజన్ కర్మాగారం

రాజకోట, అక్టో 11

సౌరాష్ట్రలోని భావనగర్‌లో ప్రథమముగా యేర్పరుచబడనున్న ఆక్సిజన్ కర్మాగారం యీ నెలాఖరుకు ప్రారంభింపబడుతుంది. ఇది ఒక బొంబాయి వాణిజ్య సంస్థకు చెందినది. దీని ఖరీదు రు. 2,00,000 లు, రుపీ పేమెంటు పద్ధతిమీద జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న రు. 400,000 లకు విలువగలిగిన యంత్రసామగ్రిఉన్నదీ కర్మాగారానికి. (నెహెన్)

కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో కవి సమ్మేళనం

హైద్రాబాద్, అక్టో 11

రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు (ఎం.పి.) అధ్యక్షతన గత సోమవారం నాడు కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాధ్వర్యాన కవి సమ్మేళనము జరిగింది. గాంధీజయంతి సప్తాహంతుది దినంనాడు రవీంద్ర శతజయంతి జయంత్యుత్సవ సంవత్సర ద్వితీయభాగంలో ఈ కవి సమ్మేళనం ఏర్పాటుచేయడం ఉచితంగా ఉందని శ్రీ రామానుజరావు ప్రస్తావించారు. శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు.

శ్రీయుతులు దాశరథి, అరిపిరాల విశ్వం, షేక్ మహబూబ్, ముదిశిధర్ మహంతాళి వెంకటేశ్వరరావు, పి బాల్‌రెడ్డి, మేడేపల్లి లక్ష్మీకాంతం, టి

ఆకాశవాణి

హైదరాబాదు-ఎ

శుక్రవారం అక్టో 13

455.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తి రంజని, 6-55 కార్యక్రమ వివరణ, 7-00 తె॥వా॥, 7-15 పి.ఎస్. లక్ష్మి: వయొలిన్, 7-40 గాంధీ మార్గము, 8-00 అం॥వా॥, 8-15 హిం॥వా॥, 8-30 హిందూస్థానీ సంగీత శిక్షణ, 8-45 ప్రసారసమాప్తి.

మ॥ 11-40 మాధ్యమిక పాఠశాలలకు 12.10 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ) 12 30 కార్మికుల కార్యక్రమము, 1-00 స్త్రీలకు (హిందీ), 1-30 శాస్త్రీయ సంగీతం, 1-50 తె॥వా॥, 2-00 హైదరాబాద్ బి వరె, 2-10 ఉ॥వా॥, 2-20 హైదరాబాద్ బి వరె, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 నాటిక (ఉర్దూ), 7-00 తె॥వా॥, 7-15 గాంధీమార్గము (హిందీ), 7-30 కర్ణాటక సంగీతకచేరీ (మద్రాసునుండి రిలే), 9-00 అం॥వా॥, 9-15 ఉ॥వా॥, 9-30 నాటిక, 9-45 టి. విశ్వనాథం: వేణువు, 11-00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

49.02 మీ (6120 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వరె, 8-45 ప్రసార సమాప్తి

42.02 మీ (7140 కిలోసై)

మ॥ 11-40 హైద్రాబాద్ ఎ వరె. 12-10 షేక్ హుస్సేన్ సాహెబ్: క్లారినెట్, 12-30 హైద్రాబాద్ ఎ వరె, 1-00 పి.ఎస్. లక్ష్మి: వయొలిన్, 1 30 హైదరాబాద్ ఎ వరె, 2-00 ఎస్. సూర్యనారాయణ రాజు, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైద్రాబాద్ ఎ వరె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె॥వా॥, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 హైద్రాబాద్ ఎ వరె, 9-00 అం॥వా॥, 9-15 నృత్యసంగీతం, 9-30 హైద్రాబాదు ఎ వరె, 11-00 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

పోయిన యౌవనము

మరియు ఆరోగ్యమును సంపాదించి తిరిగి తమ జీవితానందమును యోగ్యత సంపాదించుటకు నేడే సుప్రసిద్ధి గాంచిన గవర్నమెంట్ రిజిస్టరుపొందిన డాక్టర్ చౌహాన్ గారితో వెంటనే సంప్రదించండి. వారి దివ్యానుభవముతో నిరాశచెందిన వేలకొలది యువకులకు జీవించటానికి ఇచ్చును, ఉత్సాహాన్ని కలుగజేశారు. కావున ఈ సువర్ణావకాశమువల్ల లాభము పొందండి. స్త్రీ పురుషులకు ఉన్న గుప్త వ్యాధులను గూడా నమ్మకంగా బాగుచేశారు.

సంప్రదింపులకు సమయాలు: ఉ॥ 8 గం॥ నుంచి రాత్రి 8 వరకు

కుల్దీప్ మెడికల్ హాల్, నాంపల్లిచమన్, పబ్లిక్ గార్డెన్ రోడ్ హైద్రాబాదు.

విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంస్థ ఫెలోషిప్పులు

న్యూఢిల్లీ అక్టో 11

1961-62 వ సంవత్సరంలో శాస్త్ర విషయాలలో సీనియర్ ఫెలోషిప్పులు: జూనియర్ ఫెలోషిప్పులు బహూకరించ బడిన వారి పేర్లను విశ్వ విద్యాలయ గ్రాంటులసంస్థ ప్రకటించింది

సీనియర్ ఫెలోషిప్పులు పొందిన వారికి నెలకు రు. 500లు, జూనియర్ ఫెలోషిప్పులు పొందినవారికి నెలకు రు. 370లు. యిస్తారు. సీనియర్ ఫెలోషిప్పులు పొందిన అభ్యర్థులలో క్రిందివారున్నారు.

రసాయనశాస్త్రం:— డాక్టరు ఎం. వి. లక్ష్మీకాంతం, డాక్టరు శ్రీమతి ఎస్. రంగనాయర్. జంతుశాస్త్రం:— డాక్టరు హెచ్.ఆర్. శ్రీనివాసాచార్ భౌతికవిజ్ఞానం:— డాక్టరు కుమారి పి.ఆర్.కె.యల్. పద్మిని, డాక్టరు ఆర్. చిదంబర్. జూనియర్ ఫెలోషిప్పులు పొందిన అభ్యర్థులలో కొంత మంది పేర్లివి:— రసాయనశాస్త్రం:- శ్రీ జి యస్. మహాగన్‌చెట్టి కుమారి ఇందిరాకుమారి, శ్రీ గాడేపల్లి నాగేశ్వరరావు, శ్రీ ఎం.ఆర్. కోటీశ్వరరావు, శ్రీ సి.పి జాషువా, శ్రీ జి. వ్రిభాకరరావు, శ్రీ ఎ.ఎస్.ఎస్. మూర్తి, శ్రీ ఎ.ఎల్. జగన్నాథరావు శ్రీ ఎ. ఎస్. ఆర్. ఆంజనేయులు. వృక్షశాస్త్రం:- కుమారి ఎం. లక్ష్మి కుమారి, కుమారి ఎస్.మాలిని. జంతుశాస్త్రం:- డా॥కుమారి ఎం.ఎస్.లక్ష్మి శ్రీ పి. సీతారామయ్య, భౌతికవిజ్ఞానము:- డా॥ సి. బాలసుబ్రహ్మణ్యం, శ్రీ పి. కృష్ణ, శ్రీ ఆర్.వి శర్మ. గణిత శాస్త్రం:- కుమారి ఎస్.ఎల్. రత్న, కుమారి జి.కె. రాజేశ్వరి, శ్రీ జె. కృష్ణారావు.

మరో లక్షటన్నుల పంచదార విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 11

పంచదార విషయంలో ప్రజల అవసరాలను తీర్చడానికి బహిరంగ మార్కెటులో విక్రయానికిగాను 1960-61 ఉత్పత్తి మొత్తంనుంచి మరో లక్ష టన్నుల పంచదార విడుదల చేయడానికి భారతప్రభుత్వము నిర్ణయించినది.

ఇండియాలో రోడ్డు రవాణా సౌకర్యాలు

వినియోగించుకొనే జనాభా 88 శాతం

మద్రాసు, అక్టో 11

ప్రపంచ దేశాలలో 1960లో రిజిస్టరయిన మోటారు వాహనాల సంఖ్య సుమారు, 10 కోట్లు. రోడ్లపై వెచ్చించిన సొమ్ము దాదాపు 20 బిలియన్ల అమెరికన్ డాలర్లు ప్రపంచ జనాభాలో యించుమించు మూడో వంతు జనాభాగల ఆసియా, దూరప్రాచ్య దేశాల ఆర్థిక సంస్థ ప్రాంతంలో మోటారు వాహనాల సంఖ్య ప్రపంచంలో యీ వాహనాల సంఖ్యలో 3 1/2 శాతం మాత్రమే. కాని, యీ సంఖ్య త్వరితంగా హెచ్చుతోంది.

ప్రపంచంలో సగటున ప్రతి 18 మందికి ఒక్కొక్క వాహనం వుంటే, ఆసియా, దూరప్రాచ్య దేశాల ఆర్థిక సంస్థ ప్రాంతంలో ప్రతి 330 మందికి ఒక వాహనం ఉంది.

యుద్ధానంతరం, చాలా దేశాలలో రైల్వేలకన్న రోడ్డు రవాణా సౌకర్యాలే త్వరితముగా అభివృద్ధిచెందుతూ వుండడం గమనార్హం. ఇందుకు కారణం రోడ్డు రవాణా సౌకర్యం ఆర్థికముగా లాభదాయకముగా ఉండడం.

రోడ్డు రవాణా సర్వీసులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి- నిపుణులు కాని అనేక మంది కార్మికులు వీటిలో పనిచేస్తున్నారు. రైల్వేలలో ఒకరికి ఉద్యోగం లభిస్తూ ఉంటే రోడ్డు రవాణా పరిశ్రమలో ఏడుమందికి ఉద్యోగంలభిస్తోంది. రోడ్లూ, రోడ్డు రవాణా సౌకర్యాలూ త్వరితముగా అభివృద్ధి చెందడానికి ఇది ఒక ముఖ్యమైన కారణం.

ప్రపంచంలో యితర దేశాలలో మొత్తం ప్రయాణీకులలో రోడ్డు రవాణా సౌకర్యాలను వినియోగించుకుంటున్న వారు 60 నుంచి 90 శాతం వరకూ ఉంటే, ఆసియా, దూరప్రాచ్య దేశాల ఆర్థిక సంస్థ ప్రాంతంలోని దేశాలలో ఆశాతం 35 నుంచి 90వరకూ ఉంది కొన్ని దేశాలలో వివరాలివి:

మలయా ఫెడరేషన్-85 శాతం, భారతదేశం-88 శాతం, కొరియా-75 శాతం, ఫిలిప్పైన్సు-80 నుంచి 90 శాతం.

రోడ్డు రవాణా సౌకర్యాల పరిశీలనకు ఆసియా, దూరప్రాచ్య దేశాల ఆర్థిక సహాయ సంస్థ ఏర్పాటుచేసిన గోష్ఠినీ ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించిన అనంతరం భారత ప్రతినిధివర్గం నాయకులు శ్రీ హెచ్ పి. సిన్హా యీ గోష్ఠికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. బర్మా ప్రతినిధి శ్రీ సి.డి.ఇ. స్టీవెన్‌సన్ తొలి ఉపాధ్యక్షులుగానూ, మలయా ఫెడరేషన్ ప్రతినిధి శ్రీ సి.సి. మీనన్ ద్వితీయ ఉపాధ్యక్షులుగానూ ఎన్నికయ్యారు.

వివిధ దేశాలనుంచి వచ్చిన ప్రతినిధులు ప్రసంగించిన అనంతరం, చర్చనీయాంశాలను గురించి సమగ్రంగా పరిశీలించి నివేదించేందుకు ప్రవీణులతో కూడిన మూడు నిర్వహణ బృందాలను నియమించాలని నిర్ణయించబడింది.

ఈ మూడు బృందాలూ అక్టోబర్ 12వ తేదీకి తమ నివేదికలు సమర్పిస్తున్నాయి.

సూర్యాపేటలో గాంధీ జయంతి

సూర్యాపేట, అక్టో 11

సూర్యాపేట స్థానికముగా, గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని, మున్సిపాలిటీ వారిచే, మైమార్కులు వారిచే వివిధ కార్యక్రమాలు నిర్వర్తించ బడినవి. మున్సిపల్ ఛైయిర్మన్ డా॥ కె. శ్రీనివాసస్వామి మున్సిపాల్టీ అధికార్లు కలిసి హరిజనవాడలో వీధులను పరిశుభ్రం కావించారు. ఆరోగ్యశాఖ వారుకూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థానిక బహుళార్థకోన్నత పాఠశాలలో శ్రీనివాసస్వామి అధ్యక్షతన బహిరంగసభ జరుపబడింది. శ్రీయుతులు జ్ఞానస్వరూప్ (హయి (స్కూల్ వ్రిధానోపాధ్యాయులు) పండిత విశ్వామిత్రి, ఇతర ఉపాధ్యాయులు సంభాషించారు.

మాన్పూర్ ప్రాజెక్టుకు విహారయాత్ర

భూపణరావుపేట, అక్టో 11

భూపణరావుపేట (తా॥ మెటుపల్లి జిల్లా కరీంనగర్) మాధ్యమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 150మంది ఉపాధ్యాయ బృందము కలిసి మాన్పూర్ ప్రాజెక్టును చూచుటకయి వెళ్ళినారు. అక్కడ ప్రాజెక్టును గురించి ఉపాధ్యాయులు అన్ని విషయములు బోధించినారు. ఇట్లు మావిజ్ఞానయాత్రకు సదవకాశము కల్పించినందులకు మా ప్రధానోపాధ్యాయులవారు శ్రీ బి. వరదాచార్యులకు విద్యార్థిసంఘ కార్యదర్శి శ్రీ ఎ.లక్ష్మీనరసయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ మహాసముద్ర గర్భంలో ముడి ఇనుము

న్యూఢిల్లీ, అక్టోబరు 11

హిందూమహాసముద్ర గర్భజలాలవరకు అగ్ని పర్వతాల మూలముగా యేర్పడిన రాతితోకూడి ఉన్నది దక్షిణ భాగంలో ముడి ఇనుము, మాంగనీసు నిధులు బ్రహ్మాండమైన మొత్తాల్లోఉన్నాయి. వాటిలో 0.5 శాతం నికెల్ కోబాల్ట్, అపురూప లోహాలుఉన్నాయి.

ఇటీవల పసిఫిక్ లూలూలో జరిగిన అంతర్జాతీయ సాగర శాస్త్ర మహాసభలో సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తలు ఈవిషయాన్ని తెలియజేశారు సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తలు "విత్యజ్" అనే పరిశోధక నౌకతో హిందూ మహాసముద్రంలో పరిశోధనలుజరిపి యీ విషయాన్ని తెలుసుకొన్నారు.

రెండు సంవత్సరాల పాటు జరిపిన యీసంశోధనాయాత్రా సమయంలో సోవియట్ విజ్ఞానశాస్త్రవేత్తలు హిందూ మహాసముద్ర గర్భంలోని భూమి పొరయొక్క నిర్మాణాన్ని గురించి, మంచాన్నిగురించీ తెలుసుకొన్నారు, నీటిలోమునిగిఉన్న అనేక పర్వతశ్రేణులను కనుగొన్నారు. హిందూ మహాసముద్రం మధ్యభాగంలో కనుగొనబడిన ఒక పర్వతానికి, రష్యా, భారత దేశాల మధ్య సంబంధాలనుస్థాపించిన మొట్టమొదటి రష్యన్ ఆస్ట్రనీకికిన్ పేరుపెట్టబడింది.

హిందూ మహాసముద్రంలో అనేక రకాలజంతుజాలంఉన్నది. సముద్రంలో అధికభాగంలో చేపలు, సముద్ర జంతువులు నివసించటానికి అవసరమైన ప్రాణవాయువు తగినంతగాఉన్నది. కాని అరేబియా సముద్రం, బంగాళాఖాతంలలో ప్రాణవాయువు తక్కువగాఉన్నది. కొన్ని చోట్లయితే పూర్తిగాలేదు. అందువల్ల జీవజాలం అక్కడ ఉండటానికి అవకాశం లేకపోతున్నది.

అంతర్జాతీయ కార్యక్రమాన్నను సరించి "విత్యజ్" పరిశోధనలు కొనసాగుతున్నాయి.

సిద్దిపేటలో కవిసమ్మేళనము

సిద్దిపేట, అక్టో 11

సిద్దిపేటలో యీ నెల 6వ తేదీన "గాంధీస్మారక నిధి, గ్రామసేవా కేంద్రము (తిలక్ నగర్) పొన్నాల" వారు నిర్వహించిన గాంధీ జయంతి ఉత్సవముల సందర్భమున జె.బి.ఎస్. ఆవరణలో "కవిసమ్మేళనము" జరిగినది. సమావేశమునకు శ్రీ వేముగంటి నరసింహాచార్యులు అధ్యక్షత వహించారు- కవిసమ్మేళనములో కె. వెంకటాచార్యులు, ఎం. ఈశ్వరచరణ్, ఆంజనేయశర్మ, మహమ్మద్ అన్సారి మజరుల్లాహ్ సారి, హెచ్. వెంకటరామయ్య, సరోజాదేవి, కె. రాజయ్య, సుబ్బారావు, సాలగ్రాం, వైద్యనాథ్, మురళీధర్ మొదలగువారు ఉర్దూ, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో రచనలను వినిపించిరి.

కరీంనగరం యూత్ క్లబ్ ప్రారంభోత్సవం

కరీంనగర్, అక్టో 11

ఈమధ్య కరీంనగరంలోని జ్యోతీనగర్ (వీధి) జాతీయ యువజన మండలి శుభోదయ గ్రంథాలయము జ్యోతీనగర్ వీధి ప్రారంభోత్సవము గతనెల 25న జరిగినది.

శ్రీ సి. ఆనందరావు (అడ్వకేటు) అధ్యక్షతన శ్రీ భాజీ బషీ రొడ్డిన్ (సిటీ మున్సిపాలిటీ చెయిర్మన్) గారి ప్రారంభోత్సవమున శ్రీ యం. వి. నర్సింహారెడ్డి (జిల్లా గ్రంథాలయ కార్యదర్శి) శ్రీ బి వెంకట్రామారావు (జిల్లాగ్రంథాలయ అధ్యక్షులు) ప్రధాన ఆతిథ్యమున కార్యక్రమం జరిగినది. శ్రీ పి. భూమయ్య స్వాగత పత్రం సమర్పించారు.

శ్రీ జె. ఆర్. గోపాల్ రావు (సిటీ మున్సిపల్ మెంబరు) విధిప్రారంభోత్సవముచేస్తూ యువకుల కర్తవ్యాలను వివరించారు.

శ్రీ యం. వి. నర్సింహారెడ్డి ఉపన్యసిస్తూ యువకుల విధులను సంఘ ఆశయాలను వివరించారు.

శ్రీ బి రాజేశ్వరరావు కార్యదర్శి నివేదికను వినిపించారు. శ్రీ బి వెంకట్రామారావు గ్రంథాలయ కార్యక్రమాలను ఉపన్యసించారు. శ్రీ కె. మల్లారెడ్డి శ్రీ సరోత్తమరావు తమ ఉపన్యాసములో యువకుల గ్రంథాలయ ఆదర్శ విధిగా మారాలని ఆశీర్వదించారు.

శ్రీ భాజాబషీ రొడ్డిన్ (సిటీ మున్సిపల్ ఛెయిర్మన్) ఈ సంఘానికి తమ సాయశక్తులా సహకారమిస్తానని అన్నారు.

శ్రీ సి. ఆనందరావు అధ్యక్షోపన్యాసంలో విధి ఆదర్శపేరుకు అభినందించారు- శ్రీ యం.వి. నర్సింహారెడ్డి కృతజ్ఞతలతో తేనీటివిందుతో సమావేశం ముగిసింది.

లేఖావళి

ఆపివేయబడిన తెలంగాణా హైస్కూలు విద్యార్థుల పరీక్షా ఫలితాలు

అయ్యా!

మల్టిపర్పస్ హైస్కూల్ విద్యార్థులు (మార్చి, ఏప్రిల్ 1961 లో) కాపీకొట్టారనే నెపంతో 50 మంది నిజామాబాదు విద్యార్థులకు ఇంకా ఖమ్మంమెట్టు తదితర పాఠశాలలలోని విద్యార్థులకు సంబంధించిన ఫలితాలను ఆపారు. కాపీ ఎవరో కొంతమంది విద్యార్థులు కొడితే అది అవరుసలో ఉన్న మొత్తం విద్యార్థులకు ఆటంకం కావల్సి వస్తున్నది. త్వరలో న్యాయం విచారించి ఫలితము తెల్పితే బాగుండేది. ఆలస్యము చేయకమువలన బీదవారు ఈచదువులపై ఆధారపడి ఉన్న విద్యార్థుల జీవితము ధ్వంసముఅవుతున్నది. తిరిగి పరీక్ష ఇవ్వడానికో లేక పైతరగతి చదువడానికో లేక తుదకు బి బారు చేయబడ్డానో ఏదో ఒక నిర్ణయము జరుగుతే వారు తమ గమనము ఎలానడుచుకోవాలో తెల్సుకొంటారు. జూన్‌లో రిజల్టులు బయటపడితే ఆగస్టులోసంజాయిషీ నోటీసులు పంపించారు. వాటికి జవాబు పంపుతే ఇంతవరకు తిరిగి నిర్ణయము ప్రకటించలేదు. కొంత మంది ఉపాధ్యాయులు పోట్లాడుకొని ఇలా విద్యార్థుల జీవితాలు నాశనముకావడానికి కారణమయిన పాఠశాలలు కూడా లేకపోలేదు. కోర్టుకు వెళ్ళుదామంటే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందితో బాధపడుచున్నారు కావున ప్రభుత్వము వెంటనే విద్యార్థుల బాధ గుర్తించి, తెలివిగల విద్యార్థుల పరిస్థితి చూచి అయినా వెంటనే ఫలితాలను తెల్పి న్యాయం చెయ్యాలని ప్రార్థించుచున్నాను.

ఇట్లు

యం.వి. నర్సింహారెడ్డి

ప్రధాన కార్యదర్శి

అఖిల తెలంగాణాఉన్నత పాఠశాలల విద్యార్థి సంఘం

...—

విజయదశమి బుధవారమా? గురువారమా?

అయ్యా!

శమీపూజ ఈప్లవసంవత్సరఆశ్వయుజ శుద్ధనవమీ[18-10-61]బుధవారమా? లేక దశమీ [19-10-61] గురువారమా? యను సందేహములు సంభవించుటచే ఈక్రింది వివరమును ప్రకటించ సాహసించితిని. ఇక ప్లవ సంవత్సర ఆశ్వయుజశుద్ధనవమీ బుధవారం [18-10-61] నవమి తిథి 25 44 ఘడియలు. శ్రవణము 48-38 ఘడియలు- మరియు వరదినమగు గురువారము [19-10-61] దశమి 19 29 ధనిష్ఠ 39-05 ఘడియలు గలదు మరియు పంచాంగ కర్తలచే దశమి తిథి తుదియందు విజయ దశమి శమీపూజ అని వ్రాయబడియున్నది. కొన్నిటియందు కొందరు నవమి బుధవారమే జరుపవలయుననియు వ్రాసిరి. ఈసందేహమునుగూర్చి పంచాంగ కర్తలు భిన్నభావములు వ్రాయుదురో? లేక అచ్చగునప్పుడు పొరపాటు జరుగునో? తెల్యకున్నది. పది ఎట్లున్నను దశమీ శమీ పూజ నవమీ బుధవారము జరుపుటకు నాకు లభించినమట్టుకు ధర్మశాస్త్రమును పొందుపరచబడినది శ్లో॥ యాపూర్ణా నవమీయుక్తా. తస్యాం పూజ్యాపరాజితా॥ శేషమార్ధం విజయార్థంచ పూర్వోక్తవిధినాసైకా॥ నవమీ శేషయుక్తాయాం దశమ్యాం త్వపరాజితా. దదాతి విజయం దేవి పూజితా జయవర్ధినీ॥

అను వచనానుసారం "యాపూర్ణా నవమీ యుక్తా, నవమీ శేషయుక్తాయాం" ఇత్యాది ఆధారములచేనవమీ బుధవారమునకు బలము కలుగుచున్నది. పరదినమగు దశమీ గురువారమునకు విజయకాలమునకు ఏకాదశీ వ్యాప్తియు శ్రవణా నక్షత్రము లేనందునను ఉచితము కాదేమో? ఇందుకు.

శ్లో॥ఆశ్వీజ శుక్లపక్షేతు దశమ్యాం పూజ యేన్నరః ఏకాదశ్యాంనకు శ్వేత పూజితా చాపరాజితా। మరియు ఉదయేదశమీ కించి త్సంపూర్ణైకాదశీ యది శ్రవణక్షే యదా కాలే సాతిథిర్విజయాభిధా॥

అను ప్రమాణములచే పరదినము విజయ కాలమగు సాయంత్రమునకు దశమి లేకపోవుట మరియు శ్రవణా నక్షత్రమును లేకపోవుటయనను కారణములచే గురువారం నింద్యమని తెలుచున్నది. పూర్వ దినమగు బుధవారం సాయంకాలము విజయకాలమున దశమియు శ్రవణమును యున్నందున బుధవారమే జరుపుట యోగ్యమని చెప్పవచ్చును. విజయకాలము సాయంత్రము జరుపుట విషయములో "కాలనిర్ణయే వారదవచనం"

శ్లో॥ ఈషత్సంధ్యామతి క్రాంతః కించిదుద్గిన్న తారకః విజయో నామ కాలోయం సర్వకార్యార్థసిద్ధిః॥ మరియు జ్యోతిర్విద్యా భరణము నందు. యదాశ్వినేయాదశమీ నిశాముఖే. శుభాన్వితా సావిజయాబుధైరితి॥ అర్కాన్వితాంబోధియుతాంశమీముత క్షితీశ్వరస్సర్వజనైశ్చ పూజయేత్॥

అను వచనానుసారముగా సాయంకాలమును, దశమియు, శ్రవణమును అవసరములు. కాన ఈవిషయములను పరిశీలించి బుధవారము నవమి శమీ పూజ ముఖ్యమని భావము. విజ్ఞులు ఇంతకు భిన్నముగా గురువారము జరుపుటకు ఆధారములున్న త్వరగా ప్రకటించి ప్రజలలో గల ఆందోళన తొలగింతురని కోరుచున్నాను.

ఇట్లు

కాశీరామశర్మ వైద్య

రైల్వే స్టేషన్ జడ్చర్ల, బాదేపల్లి

10-10-1961

—

బర్మాప్రధాని పెకింగ్ రాక

పెకింగ్, అక్టోబరు 11

బర్మా ప్రధానియను యూనేవిమానంలో స్వల్ప మజిలీకై యిక్కడికి వచ్చారు. ఈసందర్భగాము ఆయన బర్మా చైనా సరిహద్దు ఒప్పందంపై సంతకాలుచేశారు.

విమానాశ్రయంలో చైనాప్రధాని చౌఎన్‌లై బర్మా ప్రధానికి స్వాగతమిచ్చారు.

నోటీసు

ఇందుమూలమున సమస్త జనులకు తెలియజేయునదేమనగా. బి. పాపరెడ్డి వల్లు ఎల్లారెడ్డిగారు మహమ్మద్ మహబూబ్ వల్లు షేఖ్ మదార్ సాకిన్ బేగంబజార్ ఎ. క్లాస్ కంట్రాక్టు చిక్కడపల్లి (హైద్రాబాద్) లోని 1-8-353 నెంబరుగల ఇంటిని కొనుటకు నిశ్చయించుకొని కొంత బయానా కూడ ఇచ్చినారు. 1961 అక్టోబర్ 28న నా పేర విక్రయ దస్తావేజు అమలు జరుగును.

పై గృహం విషయంలో ఎవరికయిన యేలాంటి హక్కయినా యున్నచో అట్టి హక్కును బలపరుచుటకుగల ఆధారాలతో సహా ఈ నోటీసు ప్రచురింపబడిన లగాయతు పదిరోజులలో వాకు తెలియజేయాలి తెలియ జేయని యెడల ఆస్తిపై యితరులకెవ్వరికీ హక్కులేదని భావించి నా విక్రయ దస్తావేజు అమలు జరుపుకుంటాను. ఆ తర్వాత యెట్టి ఆక్షేపణ చెల్లనేరదు.

ఇట్లు

బి. పాపరెడ్డి

ఉప్పరిగూడెం

తా॥ యిబ్రాహీం పట్నం

జిల్లా హైద్రాబాద్.

తేది. 12-10-1961

సెంట్రల్ రైల్వే విద్యుత్ శాఖ

టెండర్ నోటీసు

దిగువ సుదాహరించిన పనులకు డివిజనల్ సూపరింటెండెంట్, (ఎలక్ట్రికల్) సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్‌వారు విడి సీల్డు టెండర్లు కోరుచున్నారు. టెండర్లు 4-11-61 తేది మధ్యాహ్నం 1-00 గం. వరకు తీసుకోబడును. అదేరోజు సా॥ 3-00 గం. తెరువబడును.

వరుస సంఖ్య	పని వివరములు	టెండర్ నెం.	డిపాజిట్ పైకం
1.	కర్నూల్ టౌన్-ఆర్. బి. టైప్ I క్వార్టర్లకు సమానమైన (పాతఎస్ ఎస్ ఎస్ ఆర్ టైప్) 45 యూనిట్ల క్వార్టర్లకు విద్యుత్ ఏర్పాట్లు.	SC/L/243/P/28	రు. 290/-
2.	కర్నూల్ టౌన్ - ఆర్. బి. టైప్ II క్వార్టర్లకు సమానమైన (పాత ఎస్. ఎస్ ఎస్ ఆర్ టైప్) 5 యూనిట్ల క్వార్టర్లకు విద్యుత్ ఏర్పాట్లు.	SC/L/243/P/27	రు. 50/-
3.	కాజీపేట - ఆర్ బి టైప్ 1 వి 12 యూనిట్లు ఆర్ బి టైప్ II వి 5 యూనిట్లు మరియు ఆర్ బి టైప్ III వి 4 యూనిట్లకు, విద్యుత్ ఏర్పాట్లు.	SC/L/243/P/23	రు 180/-

టెండర్ డాక్యుమెంట్లు ప్రతిదానికి రు. 5/- (పోస్టల్ ఛార్జీలతో) నగదు లేక మణియార్డరుద్వారా (వాపసు యివ్వబడదు) చెల్లించి, డివిజనల్ సూపరింటెండెంట్ (ఎలక్ట్రికల్) సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ నుండి 8-11-61 మధ్యాహ్నం 1-00 గం. వరకు పొందవచ్చును.

దివాన్ దేవిడివద్ద 15 10-61

ఉదయం 10-00 గం. గొప్ప వేలం

పెద్ద మొత్తములోగల రంగూన్ టేక్ వుడ్ దూలములు, వాసములు, తలుపులు, కిటికీలు, వందలాది జింక్‌షీట్లు, ఐరన్ కమ్మలు, గర్డర్లు మరియు ఫక్రుల్‌ముల్క్ దేవిడీల వందలాది నిర్మాణపు సామగ్రి ఫర్నిచర్. గ్రాకరీ, డ్యూరీలు, సైకిళ్ళు, స్టీల్, కొయ్యపెన్సిళ్ళు, శిథిలమైన కోళ్ళఫర్ వస్తువులు గలవు.

అక్టోబర్ 14 శనివారం తనిఖీ

జె. మూసా అండ్ సన్స్, ఆక్షనీర్స్

ఫోన్: 5111.

విజయవంతమైన 4 వ సంయుక్త వారం

ఉత్సాహపూరితమైన ఉత్తమ చిత్రం

కవితా చిత్రాస్:

వాగ్దానం

(తెలుగు)

తా: నాగేశ్వరరావు కృష్ణకుమారి, రేలంగి, గుమ్మడి, చలం, సూర్యకాంతం, పద్మనాభం, మరియు గిరిజ.

ప్యాలెస్ రాజేశ్వర్

హైద్రాబాద్. సికింద్రాబాద్.

ప్రతిరోజు 3 ఆటలు: 3-00, 6-30 మరియు 9-30 గం॥

రామా-వరంగల్.

శ్రీఫిలిమ్స్ విడుదల.

10 వ సంయుక్త వారం!

శ్రీ సారథి స్టూడియోస్ వారి:

కలసివుంటే కలదు సుఖం

(తెలుగు)

తా॥ ఎన్. టి. రామారావు, సావిత్రి, రంగారావు, రేలంగి, సూర్యకాంతం. ఆఖరిరోజు

కమల్ ప్యాలెస్

హైద్రాబాద్. సికింద్రాబాద్.

ఆటలు: 6-00, 9-30.

శ్రీనివాస్ - వరంగల్.

రేపటి నుండి:

రీగల్ రహత్

ఖైరతాబాదు ముషీరాబాద్

—నవయుగ విడుదల.

అజంతా సైకిళ్ళు

(మధ్యతరగతి ప్రభుత్వోద్యోగులకు) వాయిదా పద్ధతులపై లభించుచున్నవి.

సంప్రదించండి:

బి. కిషన్‌లాల్ సైకిల్ ఇండస్ట్రీస్

కిరాయ పద్ధతిన అమ్మకపు ఏజన్సీ కార్యాలయం

A. A. ఉస్మాన్‌గంజ్—హైద్రాబాద్ (ఆం. ప్ర)

దసరా దీపావళి అమ్మకం

అధునాతన దుస్తులు, కొత్త రకములు, సరసమైన ధరలు

షర్ట్స్, బుష్‌షర్ట్స్, (100% ఐ. సి. ఐ. పెరిలెన్ కూడ కలవు)

ఫ్రాక్స్, బాబాసూట్స్, ఉలెన్, స్వెట్టర్స్, స్త్రీ పురుషుల దుస్తులు, ప్రత్యేక స్టాకు గలదు.

దయచేయండి:

రామ్ డ్రెసెస్

(A. A.) సుల్తాన్‌బజార్ క్రాస్- హైద్రాబాద్.



సులభముగా కుట్టుటకు

ఉషా

కుట్టుమిషన్

తయారు చేయువారు:-

జైఇంజనీరింగ్ వర్క్స్ లిమిటెడ్ కలకత్తా

ఇండియాలో సోల్ అమ్మకపు ఏజంట్లు:-

మెసర్స్: ఏజంట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్

డిస్ట్రిబ్యూటర్స్:-

—నథూలాల్ జీ—

గన్‌ఫౌండ్రి హైద్రాబాద్ ఫోన్: 35118	మహాత్మాగాంధి రోడ్, పోలీస్ స్టేషన్ వద్ద సికింద్రాబాద్.	రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ ఫోన్: 72415.	నిజాంషాహి రోడ్, రిజిస్ట్రార్స్ ఆఫీసు ఎదుట. హైద్రాబాద్.

[A. A.] చిక్కడపల్లి: గుల్షన్‌హోటల్ వద్ద, హైద్రాబాద్.



అన్నిరకములైన బ్యాంకింగ్ సౌకర్యములు లభించును

ది బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

టి.డి. కన్సారా, జనరల్ మేనేజర్

B/C/63 TL

మెసర్స్ కల్వ సూర్యనారాయణ
ఉస్మాన్‌గంజు కమిషన్ ఏజంటు
ఫోన్ నెం. 4412
హైదరాబాద్, అక్టోబర్ 11
(క్వింటల్ ధరలు)

క్వింటల్ అంటే 100 కిలో గ్రాములు	
పాలకుర్లు బియ్యం	58-00 61-75
గుజ్జలు	61 00 63-50
నెం 19 నెంబర్లు	58 0) 62-00
దొడ్డు బియ్యం	55-50 57-00
గర్కులు	54-00 56-00
నానకరాంలు	58-00 62-00
బంగారుతీగెలు	66-00 68-00
గొట్టెబియ్యం	47-00 51-00
24 నెంబర్లు	66-50 68-00
ఎస్.కె.కె. బియ్యం	65-00 66-00
కొత్తసాంబర్లు	67-00 77-00
పాతసాంబర్లు	69-00 78-00
కుసుమ బియ్యం	60 00 61-70
పచ్చజొన్నలు	27-50 29-00
చట్టిజొన్నలు	32-00 36-00
తెల్లజొన్నలు	37-50 40-50
పసుపు	114-00 120-00
కందులు పెద్దవి	42-00 43-00
కందులు చిన్నవి	34-00 36-00
మినుములు	48-50 51-90
సెనగలు	43-00 47-00
పెసలు	36-00 38-90
వులవలు	31-50 32- 0
బెల్లం	25-00 34-50
మిరపకాయలు	90-00 140 00
చింతపండు	60-00 90-00
పుల్లిగడ్డ	32-00 44-00
యెల్లిగడ్డ	32-00 90-00
తెల్ల నువ్వులు	99-00 108 00
ఆముదాలు	60-00 64-00
ధనియాలు	62-00 65-00
కుసుమలు	41-00 44-00
యిలాతిపల్కు-పెద్దది	114-00 118-00
యిలాతికాయసం-13	62-00 70-00
బన్సి గోధుమలు	54-00 59-00
శర్బతి గోధుమలు	46-00 50-00
పత్తిగింజలు	26-00 30-00
కందిపప్పు పెద్దది	58-00 60-00
కందిపప్పు చిన్నది	50-00 52-00
సెనగపప్పు	48-00 54-00
మినుపపప్పు	70-00 74-00
పెసరపప్పు	52-00 54-00
పల్కునూనె 10 కిలో	19-12 19.25
కల్లిపిండి	24-25 24-50
అనుములు	36-0-0 42-00

ఈప్రకారము యీరోజు అయిన ధరలువార్తించిసాము. గిట్టినసరకులు పంపవచ్చును, తెప్పించుకోవచ్చును.

.....

వెండిబంగారుధరలు

సముద్రాల రాఘవయ్యగారి
చంద్రయ్య సిద్దంబర్ బజారు
ఫోన్ నెం. 4890.
హైదరాబాదు, అక్టోబర్ 11

బంగారము	146-52
ఆశోక్ చీపులు	146-51
సవరన్	95-50
వెండి 100 తు.	237-50
చిల్లర	2-40

సిద్ధేంద్ర కళాక్షేత్ర పాలకవర్గ సమావేశం

విజయవాడ, అక్టో 11

కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్ర పాలకవర్గ సమావేశం ది 8-10-61 న విజయవాడలో ఈ కళాక్షేత్ర కార్యదర్శి శ్రీ బందాకనక లింగేశ్వర్రావు గృహంలో జరిగింది. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు శ్రీ నర్రా వెంకట రత్నం, శ్రీ చింతా కృష్ణమూర్తి పాల్గొన్నారు. తిరుపతి దేవస్థానము బోర్డువారు వీరు కళాక్షేత్రానికి రు. 25 వేలు విరాళము ఇచ్చినందుకు కృతజ్ఞత తెలుపుతూ వాగ్దానం చేశారు. కార్యదర్శి సమర్పించిన కళాక్షేత్ర స్వరూప నిర్ణయాన్ని ఆమోదిస్తూ అందుకు లక్ష రూపాయలనిధి సేకరించడానికి నిర్ణయించారు.

నగర వార్తలు

రాజాబహదూర్ మహిళా కళాశాలలో గాంధీజయంతి

వెంకట్రామరెడ్డి మహిళాకళాశాలయందు 6 వ తేది సాయంత్రం శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మ అధ్యక్షతన గాంధీ జయంతి జరుపబడినది. శ్రీమతి శారద [ఎకనామిక్స్ లెక్చరర్] పరిచయ వాక్యముల పిదప మాణిక్యమ్మగారు మహాత్ముడు వెలలేని భారత రత్నమని పేర్కొనుచు ఆయన సతి మణి కస్తూరిబాను ఆదర్శస్త్రీగా వారి జీవిత సంఘటనలతో ఉదాహరించినారు. శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారి "బాపు"నుగూర్చి ప్రసంగిస్తూ, "గాంధీజీ ఆదర్శ పురుషులనియు మానవత్వమునుంచి దివ్యత్వమును సాధించిన కలియుగ అవతార పురుషుడని రు" ప్రశంసించారు. విద్యార్థినీ ప్రతినిధిగా కుమారి సీతామాణిక్యము బాపూజీ దృష్టిలో మహిళలకు గల స్థానమునుగూర్చి ప్రసంగించినది కార్యదర్శిని కుమారి సూర్యదుర్గ తుదిపలుకులతో ఉత్సవము ముగిసినది.

ఆంధ్రప్రదేశ్ సంగీత నృత్య నాటకోత్సవములు

హైదరాబాదు, అక్టోబర్ 11

ఆంధ్రప్రదేశ్ సంగీతనృత్య నాటకోత్సవములలో కళాశాలల విద్యార్థులకు నాటక పోటీలు నిర్వహింపబడుచున్నవి. పోటీలు నవంబరు 2-3 తేదీలలో జరుగును. బహుమతి ప్రదానము ప్రముఖ తెలుగు సినిమానటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావుచేనవంబరు 5 వ తేదీన లేడీ హైదరీక్లబ్బులో, జరుపబడును. ప్రవేశ రుసుము రు. 10 లతో నాటక ప్రతిని పోటీనిర్వాహకుడు శ్రీ వి. వి. వి. శాండిల్య (1-9-290/10 విద్యానగర్ హైదరాబాదు 7) కి అక్టోబరు 15 వ తేదీలోగా అందజేయ వలెను.

.....

హైకోర్టు దసరా సెలవులు

హైదరాబాదు, అక్టో 11

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దసరా సెలవుల సందర్భంగా 16 వ తేదీ సోమవారం నుండి 20 వ తేదీ శుక్రవారం వరకు (రెండు రోజులుకలుపుకొని) మూసిఉంటుంది. అత్యవసరమైన దరఖాస్తుల పరిశీలనకు 17 తేదీన జస్టిస్ సంజీవరావు నాయుడు జరుపుతారు. ఇందుకై దరఖాస్తుల నోటీసు అసిస్టెంటు రిజిస్ట్రారు శ్రీ వి. రామానుజాచారికి 16 వ తేది మధ్యాహ్నం 2 గంటలలోగా అందజేయాలి.

.....

ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి

(స్వ. వి.)

విజయవాడ, అక్టో 11

ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి ఎనిమిదవ సర్వసభ్య సమావేశం ఇటీవల అధ్యక్షులు శ్రీ గిరిజా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి శ్రీ బొడ్డపాటి సత్యనారాయణ గత సంవత్సరాల వార్షిక నివేదికను సమర్పించారు. హైదరాబాద్‌లోని ఫిలిం వాణిజ్య మండలి, ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలిలో విలీనమయ్యే సూచన ఒకటి వచ్చిందని ఆయన అన్నారు. తర్వాత జరిగిన ఎన్నికలలో శ్రీ పి. చంద్రశేఖరరావు (వయుగ ఫిలింసు) అధ్యక్షులుగానూ, ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు పోతిన వెంకట్టి, చారనాత్యనారాయణ, కార్యదర్శులుగా శ్రీయుతులుడి.సి. శేఖరరావు, పి. సుబ్బారావుగార్లు, కోశాధికారిగా శ్రీ కె.సి. గంగారావు ఎన్నికైనారు. సభ్యులుగా శ్రీయుతులు కె. కృష్ణ, వి. సత్యనారాయణ, ఇ.లక్ష్మణరావు, డి.వి.జి కృష్ణచౌదరి, రామచంద్రన్, ఎం.ఎస్. రాజు, కె. సుబ్రహ్మణ్యం, జి. కామరాజుగార్లు ఎన్నికైనారు.

పందమంది రైతుల అరెస్టు

ఎర్నాకులం, అక్టోబర్ 11

కమ్యూనిస్టుల బలపంచే కేరళ రైతు సంఘానికి చెందిన పందమంది రైతులు ఇట్టువలి గ్రామంలో తెల్లవారకముందు ఒక చేలో ప్రవేశించి పరకోతను జరుపుతుండగా పోలీసులు వారినితమఅదుపులోనికి తీసుకున్నారు.

అరబ్ రాజ్యాల ఫెడరేషన్ స్థాపన

నూతనసిరియా ప్రభుత్వ ప్రతిపాదన

డెమాస్కస్, అక్టోబరు 11

అరబ్ రాజ్యాల ఫెడరేషన్ ఏర్పాటును ప్రతిపాదిస్తూ నూతన సిరియా ప్రభుత్వము నేడొక ప్రకటన చేసింది.

ఈ ఫెడరేషన్ వికేంద్రీకృత పద్ధతిన ఉండగలదని ఫెడరేషన్ సభ్యరాజ్యాలన్నింటికీ ప్రాంతీయ, అంతర్జాతీయ సార్వభౌమాధికారం ఉండగలదని సిరియా ప్రతిపాదనలో ఉంది.

ఈ ప్రతిపాదనతో సిరియాప్రధాని మామోన్ కుజ్బరీ అరబ్ రాజ్యాల కొకవిజ్ఞప్తిపత్రం అందజేశాడు.

మీనన్‌కు స్వల్పంగా జ్వరం

న్యూయార్కు, అక్టో 11

ఇటీవలమెదడులో ఆపరేషన్ జరిగి ఆసుపత్రిలో కోలుకుంటున్న భారత రక్షణ మంత్రి సమితిలో భారతప్రతినిధిఅగు శ్రీ వి. కె. కృష్ణ మీనన్‌కు గత సాయంత్రంనుండి కొద్దిగా జ్వరం వస్తున్నది. కొంతబాధగాఉండి రాత్రి ఆయన సరిగా నిద్రించలేదని తెలుస్తున్నది.

కడప ఆసుపత్రిలో టి బి. వార్డు ఏర్పాటు

40వేల ఖర్చు ప్రతిపాదనకు జిల్లాసంఘ ఆమోదం

కడప, అక్టోబర్ 11

కడప హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రిలో రు 40,000ల ఖర్చుతో 20 పడకలు గల టి. బి. వార్డును ప్రారంభించాలన్న రాష్ట్రీయ సేవాసంఘ ప్రతిపాదనను జిల్లాతయ నివారణ సంఘం ఆమోదించినది. జిల్లాకలెక్టరు, జిల్లా వైద్యాధికారి, ఆరోగ్యశాఖాధికారి, మునిసిపల్ కమీషనరు, పి. డబ్ల్యు. డి. ఎగ్జిక్యూటివు ఇంజనీర్లతో ఒక సంఘాన్ని నియమించారు. వారు యీ విషయములో తగు నిర్ణయాలు గైకొంటారు. ఈ పథకానికి అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్రప్రభుత్వం 25 శాతం భరిస్తవి. తక్కిన డబ్బును టి.బి. చీట్ల అమ్మకం ద్వారా వచ్చినదానినుండి జిల్లాతయ నివారణ సంఘం భర్తీచేస్తుంది.

కడప, బద్వేలు ప్రాంతాలలో పోలియోవ్యాధి సోకినట్టు వార్తలందాయి. ఆరోగ్యశాఖాసిబ్బంది తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నారు.

పారిశ్రామిక వాటికలు

పరిశ్రమలశాఖా జాయింటు డైరెక్టరు శ్రీ జె శ్రీరామమూర్తి, ప్రొద్దుటూరు లఘుపరిశ్రమదారుల సమావేశములో ప్రసంగిస్తూ, ఒక సహాయకపైవేటు పారిశ్రామిక వాటికను ప్రొద్దుటూరులో నిర్మించేటందుకు ప్రభుత్వము రు. 2.67 లక్షలు మంజూరు చేసినదని అన్నారు. జిల్లాకలెక్టరు సమావేశానికి అధ్యక్షత వహించారు. పరిశ్రమల అసిస్టెంటు డైరెక్టరు శ్రీ యన్. వి. నాగేశ్వర్రావు సమావేశములో ప్రసంగిస్తూ యీ పారిశ్రామిక వాటిక భవనాల నిర్మాణము డిసెంబరులో ప్రారంభిస్తారనీ, 1962వ సంవత్సరము ఆఖరుకు నిర్మాణము పూర్తయి పని ప్రారంభిస్తుందని వెల్లడించారు. కడపలో నిర్మింపబడుతున్న పారిశ్రామిక వాటిక భవనాల నిర్మాణము పూర్తి అయినది. సమాచారశాఖ ఈనెలలో 15 చలన చిత్ర ప్రదర్శనలను, 10 బుర్రకథల కార్యక్రమాలను నిర్వహించినది. 40,000 మంది యీ ప్రదర్శనలను తిలకించారు.

జ్యోతి గ్రంథాలయం ఎన్నికలు

శంకరంపేట, అక్టో 11

శంకరంపేట గ్రామములో శ్రీ యం. వీరభద్రప్ప (ఉపాధ్యాయులు) గారి ఆధ్వర్యమున ఇటీవల జ్యోతి గ్రంథాలయ సమావేశముజరిగి ఈ క్రింది కార్యవర్గం ఎన్నుకొనబడెను.

గాండ్ల మాణిక్యం (అధ్యక్షులు), విగ్రాం రామాగౌడు(ఉపాధ్యక్షులు) వంజరి లక్ష్మి నారాయణ (కార్యదర్శి), కోయిలకొండ నర్సింలు (సహాయకార్యదర్శి), కోయిలకొండ సంగయ్య (కోశాధికారి) అన్నారం రాములు, కోయిల కొండపర్వయ్య, కుమ్మరి సంగయ్య, వి. లక్ష్మయ్య (టీచర్) (సలహా దారులు).

గుడుంబా గోలీలు!

హైద్రాబాదు, అక్టో 11

గుడుంబా నగర్ అయిన ధూల్‌పేట ప్రాంతంలో నాటుసారా ఉత్పత్తి కేంద్రాలపై పోలీసులు అడపా దడపా దాడులజరిపి ఇంటింటా వెలసిన ఈకుటీరపరిశ్రమను నిర్మూలించ ప్రయత్నిస్తున్నందున ఈ సారా ఉత్పత్తిలో క్రొత్త టెక్నిక్‌లు కనుగొన బడినవి.

ఇప్పుడు గుడుంబా ద్రవరూపంలోకాక ఘనరూపములో కుంకుడుకాయలంత గోలీలలో లభ్యమవుతున్నదని ఒక్క గోలీ వేసుకుంటే సారా త్రాగిన విధముగానే కావలసినంత నిషా వస్తుందని తెలుస్తున్నది.

(స్వ. వి.)

కళాఖండాల కొనుగోలుసంఘం

నవంబరు 18నుంచీ మద్రాసులో సమావేశం

న్యూఢిల్లీ, అక్టో 11

జాతీయ మ్యూజియం శాలూకు కళాఖండాలు కొనుగోలుసంఘం 1961 నవంబరు13,14,15 తేదీలలో మద్రాసులోని ప్రభుత్వ మ్యూజియంలో సమావేశమౌతుంది.

ఉత్తమకళాప్రావీణ్యం, అతి ప్రాచీనమూ అయి, జాతీయ ప్రాముఖ్యం గల రాతి, లోహపు శిల్ప కళాఖండాలు, శాసనాలు, చెక్కుపైల్సు, పురాతనాయుధాలు, నాణెములు, ఆభరణాలు మొదలైనవాటిని న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియంలో భద్రపరచడానికిగాను ఎంచుకుంటారు.

కళాఖండాలను అమ్మడానికి వారు 1961అక్టోబర్ 31వతేదీలోగా తాము విక్రయించదల్చిన కళాఖండాలు, వాటి వివరాలు, ధరలుగల జాబితాలను యీ క్రింది చిరునామాకు పంపాలి. అసిస్టెంటు డైరెక్టరు, జాతీయ మ్యూజియం, న్యూఢిల్లీ.

దరఖాస్తుదారులు అట్టి కళాఖండాలను యీ క్రింది చిరునామాకు పోస్టులోగాని వారు ప్రతినిధి ద్వారాగాని పంపవచ్చును. లేక స్వంత ఖర్చులతో స్వయంగా తీసుకువచ్చి చూపవచ్చును. "సూపరింటెండెంటు, గవర్నమెంటు మ్యూజియం ఎగ్మూరు, మద్రాసు. పోస్టు ద్వారానూ యితరత్రానూ పంపే కళాఖండాలు 1961 నవంబరు 6 వ తేదీ లోగా పై చిరునామాకు అందాలి.

యు. పి. వ్యవసాయ విశ్వవిద్యాలయం

సోవియట్ బహుమతి

లక్నో, అక్టో 11

భారతదేశంలో సోవియట్ రాయబారి ఐ. ఎ బెనిదిక్టోవ్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ కె. ఎ. పి. స్టీవెన్‌సన్‌కు, పశువుల కృత్రిమ గర్భధారణకు అవసరమైన 41 పరికరాలను బహూకరించారు.

న్యూఢిల్లీలో అక్టోబరు 6న ఈసందర్భంగా ఒక సమావేశం జరిగింది.

విశ్వవిద్యాలయం తరపున శ్రీ స్టీవెన్‌సన్ యీ బహుమతికి కృతజ్ఞత తెల్పి యివి విశ్వవిద్యాలయంలోనూ, దానికి అనుబంధంగా వున్న తరాయ్ ప్రభుత్వక్షేత్రంలోనూ వినియోగ పడగలవని హామీ యిచ్చారు.

ఆ తరువాత జరిగిన ఇష్టాగోష్ఠిలో సోవియట్ రాయబారి ద్వితీయ ప్రపంచయుద్ధంలో సోవియట్ దేశములో అనేక లక్షల పశువులు చంపివేయ బడ్డాయనీ, యుద్ధానంతరం మళ్ళీ పశుగణాన్ని యెక్కువ చేయడములో కృత్రిమ గర్భధారణ పద్ధతి చాల తోడ్పడిందనీ శ్రీ స్టీవెన్‌సన్‌కు తెలియజేశారు. మామూలుగాఅయితే యీ పనికి 25-30 ఏళ్ళు పట్టేది. కాని యీ క్రొత్తపద్ధతిద్వారా ఏడేళ్ళలో పశువులసంఖ్యను యెక్కువ చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు.

ట్రాలీకి రైలింజను ఢీకొని ముగ్గురి మృతి

బొంబాయి, అక్టోబరు 11

చాందివ్ డీసాన్టేషన్‌ల మధ్య గతరాత్రి తేలిక రైలు ఇంజను ఒక ట్రాలీపట్టాలపై తోసుకుంటూ నడిపే ట్రాలీకి ఢీకొనడమువల్ల ట్రాలీ మనుష్యులు ఇద్దరు మరణించారు; మరొకరు ఆస్పత్రిలో చనిపోయారు.

ప్రత్యేక ప్రీ ఇంజినీరింగు పరీక్ష

న్యూఢిల్లీ, అక్టో 11

భారత ప్రభుత్వం శాలూకు ప్రీ ఇంజినీరింగు పరీక్షల బోర్డు ఉత్తీర్ణులు కాని, కొన్ని పార్టులు వున్నవారికి 1961 అక్టోబరు 28 నుంచీ ప్రత్యేక ప్రీ ఇంజినీరింగు పరీక్షలను నిర్వహిస్తారు. ఆ పరీక్షలకు హాజరుకాగోరు అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు ఫారములను అక్టోబరు 16 లోగా పరీక్ష రుసుముతోసహా పంపాలి. నిర్ణీత దరఖాస్తు ఫారములు, కార్యదర్శి, ఢిల్లీ పాలిటెక్నిక్, ఢిల్లీ అన్న చిరునామాకు వ్రాయవలెను.

ఆక్టాయ్

(మొదటపేజీ తరువాయి)

నారాయణ యీ ప్రతిపాదనకు వ్యతిరేకత తెలిపారు. శ్రీమతి కున్వర్ రాణి శ్రీ లక్ష్మీనారాయణ తెలిపిన వ్యతిరేకాభిప్రాయాన్ని సమర్థిస్తూ నగరంలో విద్యాసౌకర్యాలను రాష్ట్ర విద్యాశాఖ యింతవరకు గమనిస్తుండగా యిప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ యీ బాధ్యతను స్వీకరించట మనవసరమని యిది పన్నులుకట్టే ప్రజలకు భారముగా పరిణమిస్తుందన్నారు.

ఈ సందర్భంలో జరిగిన చర్చలో పాల్గొన్న సభ్యుల ఉపన్యాసాలలో కాంగ్రెసు పక్షానికి చెందిన వారు ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చుటకై కృషిచేస్తున్నదన్న భావాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష సభ్యులు చేసిన విమర్శలు ప్రభుత్వంఅనుసరించిన ఆహారవిధానం భలించలేదని ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్‌చే నిర్వహించబడే చౌకదుకాణాలలో మోటు బియ్యం అందుబాటులో లేనిఅధవా వున్నా కొద్దిపాటి సరుకే ఉంటున్నదని ఆ కారణాన కార్మికులకు బీదలకు సుఖంగా లభించటంలేదని యీ దుకాణాలలో అమ్మే మంచి బియ్యం, గోధుమలు ధనిక వర్గాలనే లభిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

సోషలిస్టు పక్ష సభ్యుడు శ్రీ గోస్వామి తమ ఉపన్యాసంలో బీదబిక్కి తమ యిబ్బందులను, సమస్యలను,ఆకలిని మరచిపోవుటకై గుడంబా సేవిస్తున్నారనగా (క్రొత్తగా కార్పొరేషన్‌కు ఎన్నికైన కాంగ్రెసు పక్ష సభ్యుడు) శ్రీ జయాదారి "వస్తువుల ధరలు పెరిగి నప్పటికి ప్రజలు హోటళ్ళకు సినిమాలకు వెళ్ళటం జరుగుతునే ఫన్నదన్న అభిప్రాయాన్ని తెలిపారు. స్థాయీ సంఘం సూచించిన పిల్లల చర్మవ్యాధుల చికిత్సా కేంద్రం, సికింద్రాబాదు డివిజన్‌కు చెందిన పద్మారావు నగర్, చిలకల గూడా, మహ్మద్ గూడాలలోని హైద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన "మెయిన్ మ్యాన్ హోల్స్"ను విస్తృతంచేయటం మొదలైనప్రతిపాదనలను సమావేశంలో సభ్యులు ఆమోదించారు.

సమాజాభివృద్ధికి చెందిన వార్షిక మహాసభలో వాల్గొనుటకు వచ్చిన ప్రతినిధులకు ఆతిథ్యమిచ్చినందుకు ఖర్చు అయిన 15 వందల రూపాయలను మంజూరు చేయాలని సమావేశానికి స్థాయీ సంఘం పంపిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు.

సికింద్రాబాదు డివిజన్‌కు చెందిన లాలాపేటలోని కుష్ఠురోగుల గృహములో అదనపు వసతుల సౌకర్యాలను కల్పించుటకై అయ్యే ఖర్చులో కార్పొరేషన్ భరించవలసిన వాటా రు. 45 వేలను సభ్యులు మంజూరు చేశారు. (నగర వీధులలో తిరిగే కుష్ఠురోగులను పట్టుకొని ఈ గృహంలో వుంచి వారి వ్యాధికి అవసరమయ్యే వైద్య చికిత్స చేయబడుతుంది.)

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ట్యూషన్ ఫీజ్ పెంపకంగురించి ప్రస్తావిస్తూ సభ్యులు శ్రీయుతులు జెహాందర్ అలీఖాన్ అఫ్సార్, దేవేంద్రపూరి గోస్వామి, సయ్యద్ సిరాజుద్దీన్ కార్పొరేషన్‌కు లోగడ అందచేసిన 3 నోటీసు తీర్మానాలను, (ప్రభుత్వం యూనివర్సిటీ ఈసమస్యను పరిష్కరించిన కారణాన) వారు ఉపసంహరించుకొన్నట్లు సమావేశంలో ప్రకటించారు.

మజ్లిస్ సభ్యుల వాకౌట్

ఆహారవస్తువుల ధరలు పెరుగుదలకు సంబంధించినతీర్మానఅంశమును చర్చకు అనుమతి ఇవ్వడానికై సమావేశంలో దానిని ఓటుకుపెట్టినందున దానికి నిరసనగా మజ్లిస్ వర్గ సభ్యుడు సిరాజుద్దీన్‌తోటి మజ్లిస్ సభ్యులతో సమావేశంనుంచి వాకౌట్ చేశారు.

వృక్ష, జంతుజాల సంరక్షణ

ఈ నెల 18న కేంద్ర సలహా మండలి సమావేశం

న్యూఢిల్లీ, అక్టో 11

కేంద్ర జీవ శాస్త్ర సలహామండలి విజ్ఞాన భవన్‌లో ఈ నెల 18వ తేదీన సమావేశమై, వృక్ష జంతుజాలాన్ని తగువిధముగా సంరక్షించేందుకు శాసనము చేయవలసిన అవశ్యకతను పరిశీలించేందుకు నియమించబడిన సంఘం నివేదికను పరిశీలిస్తుంది. ఇది ఈ సలహా మండలి తృతీయ సమావేశం.

కేంద్ర శాస్త్ర పరిశోధనల, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ యీ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు.

శాస్త్ర పరిశోధనలకు స్కూలర్ షిప్పులు ఇవ్వడం, భారత వృక్షశాస్త్ర సర్వేశాఖ, భారతవిశ్వవిద్యాలయాల మధ్య ప్రచురణల మార్పిడి, భారత జంతు శాస్త్ర శాఖాధ్యక్షుడు నివేదిక, భారత వృక్ష శాస్త్ర సర్వేశాఖలో ప్రధాన వృక్ష శాస్త్ర వేత్త నివేదిక - యీ మొదలయిన విషయాలనుగురించి కూడా యీ సమావేశంలో చర్చలు సాగుతాయి.

ది గుమతి వ్యాపార కంట్రోలు సంస్థ

కార్యకలాపాల సమీక్ష

న్యూఢిల్లీ, అక్టో 11

1961 సెప్టెంబరు 30తో అంతమైన అర్థసంవత్సరంలో దిగుమతి లైసెన్సుల నిమిత్తం దిగుమతివ్యాపార కంట్రోలు సంస్థకు 2,14,204 దరఖాస్తులు వ్యాపారస్తుల వద్దనుంచి అందాయి. 1960 అక్టోబరు-1961 మార్చి మధ్య కాలంలో అందిన దరఖాస్తుల సంఖ్య 1,89,509.

1961 సెప్టెంబరు 30తో అంతమైన అర్థసంవత్సరంలో దరఖాస్తుల సంఖ్య బాగా పెరిగినా, వాటిని త్వరితగతిగా పరిశీలించి ఫైసలు చేయడం జరిగింది. సెప్టెంబరు మాసాంతానికి 2008 దరఖాస్తులు (0.9శాతం)మాత్రమే పెండింగులో ఉన్నాయి.

దిగుమతి లైసెన్సులకోసం వచ్చిన దరఖాస్తులనుపరిశీలించడమేకాకుండా దిగుమతి వ్యాపార కంట్రోలు సంస్థ వారు విధానానికి సంబంధించిన విషయాలు, నియమ నిబంధనలపై వ్యాఖ్యానాలు, వ్యాపారస్తులు వ్యాపార సంస్థలు పంపే అప్పీళ్ళకు సంబంధించి బహుళముగా ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా సాగించారు.

పైచెప్పిన అర్థ సంవత్సరంలో ఇలాంటి ఉత్తర ప్రత్యుత్తరాల సంఖ్య 7.57 లక్షలదాకా ఉంది. అక్రమాలు జరగకుండా నివారించడానికి యీ సంస్థ బాగా జాగ్రత్తవహించింది. దిగుమతి ఎగుమతి కంట్రోలు వ్యాపారనిబంధనలను ఉల్లంఘించినందుకు సమీక్షాకాలంలో 33 కంపెనీలపై తగు విధంగా చర్య తీసుకోవడం జరిగింది.

లోగడ ప్రవేశపెట్టిన పునరావృత్తపు లైసెన్సింగు పద్ధతిని కొనసాగించడం జరిగింది. ఈ పథకంవల్ల అనేక మంది కోటాదార్లకు ప్రయోజనం కల్గింది. దరఖాస్తులు పెట్టుకున్న 8 రోజులలోగా వారికి లైసెన్సులు లభించాయి.

స్టాక్‌హోంలో టాగూరు

శతజయంత్యుత్సవాలు

న్యూఢిల్లీ, అక్టో 11

స్వీడెన్‌లో టాగూరు శతజయంత్యుత్సవాలు రెండవదశ స్టాక్‌హోంటీ థియేటరులో యీ నెల 6వ తేదీన మూడుగంటలపాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహణతో ప్రారంభమైనది. టాగూరు రచించిన పోస్టాఫీసు-నాటిక స్వీడిష్ భాషలో ప్రదర్శించబడింది లీలావతిచేశారతీయశాస్త్రీయ నృత్యప్రదర్శన, స్వీడిష్ నాటక కళాకారులు శ్రీమతి అన్నికాట్రిటాంగ్ చే టాగూరు గేయపఠనం జరిగాయి. సుమారు 800 మంది యీ ప్రదర్శనానికి హాజరైనారు. భారత రాయబారి శ్రీ కేవల్‌సింగ్ అతిథులకు స్వాగతం చెప్పారు.

విమాన ప్రమాదంలో 13 మంది మృతి

నికోసియా, అక్టో 11

లిబియాలోని ఎల్ ఆదెమ్‌లో గత రాత్రి హాస్టింగ్స్ రవాణా విమానం కూలడంవల్ల 13 మంది బ్రిటిష్ సైనికులు చనిపోయారు, పలువురు తీవ్రముగా గాయపడినారు.

కెయిరోలో

గాంధీజయంత్యుత్సవాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 11

కెయిరోలోని భారతీయ గ్రంథాలయము తాలూకు సమాచారశాఖ కార్యాలయంలో యీనెల 6న గాంధీ జయంత్యుత్సవ సమావేశం జరిగింది. ప్రముఖ అరబ్బీరచయిత మాజీ మంత్రి అయిన డాక్టర్ ఫతేరిద్వాన్ గాంధీజీ సేవను కొనియాడి ఆయన ప్రబోధించిన సత్యాహింసలు నేటి ప్రపంచానికి ఎంతో అవసరమన్నారు. మహాత్మా గాంధీ ఒక్క భారత దేశానికే గాక యావత్ప్రపంచానికి చెందిన వాడని అన్నారు.

రష్యా అణ్వాయుధ పరీక్షలు

రోజురోజుకు అణుధూళి కల్మషం పెరుగుదల

టోక్యో, అక్టోబరు 11

సోవియట్ అణ్వాయుధ పరీక్షల వల్ల క్రితం రెండు రోజుల్లోను జపానులో, ఉత్తరాన ఉన్న హొక్కైడో దీవిలో వర్షంలో అణుధూళి కల్మషం బాగా పెరిగినట్టు జపాను వాతావరణ సంస్థ గత శనివారం నాడు తెలిపింది.

అక్టోబరు, 5 న కుషిరోలోలిటర్‌కి ని మి పానికి 2620 కౌంట్ల లెక్కను ఈ కల్మషం కనిపించిందని ఆ జపాను సంస్థ తెలిపింది. కాగా అక్టోబరు 6 న ఇది 3,530 ఉన్నదట. హొక్కైడో దీవిలో ఉన్న మరొక నగరం సపారోలో అక్టోబరు 6 న ఈ కౌంట్లు 1,070 ఉన్నట్లు తెలిపింది. మధ్య దక్షిణ జపాను ప్రాంతాల అణుధూళి కల్మషం 10 రెట్లు మొదలు 20 రెట్ల వరకు పెరిగిందని కూడా ఈప్రతినిధి తెలిపారు.

కాంగ్రెసు సేవాదళ ద్వితీయ సమ్మేళనం

15 వేల మంది వలంటీర్లు పాల్గొనే సూచన

బొంబాయి, అక్టోబర్ 11

భారత ప్రధాని శ్రీ నెహ్రూచే అక్టోబరు 24న ప్రారంభింప బడగల అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ ద్వితీయ సమ్మేళనంలో దేశం నలుమూలల నుండి దాదాపు 15 వేల మంది వలంటీర్లు హాజరు కాగలరు.

ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయి పటేల్ పేరిట లక్ష రూపాయల సేవాదళ అకాడమీ భవనానికి కూడా ప్రధాని శ్రీ నెహ్రూ శంకుస్థాపన జరుప నున్నారు.

1940కు పూర్వం కాంగ్రెసు సేవాదళాన్ని హిందుస్థాన్ సేవాదళ మనే వారు. ఇప్పుడీ సేవాదళంలో లక్షా పదివేల మంది వలంటీర్లున్నారు, సేవాదళ అకాడమీ రెసిడెన్షియల్ సంస్థగా పనిచేస్తుందనీ ప్రథమముగా అందులో వందమంది వలంటీర్లు చేర్చుకోబడగలరనీ నేడు బొంబాయి పి.సి.సి, అధ్యక్షుడు శ్రీ భానుశంకర యాజ్ఞిక్ తెలిపారు.

మూడు దినాలు సాగే యీ సేవాదళ సమ్మేళనం తుదినాడు వలంటీర్లు రు. 15450 విలువగల శ్రమదానం కావించగలరు.

ఆంధ్ర ప్రదేశ్ సెక్రటేరియట్ అసోసియేషన్ అభ్యర్థనలు

హైద్రాబాద్, అక్టో 11

ప్రస్తుత కరువు భత్యాన్ని ప్రాథమిక వేతనంతో పూర్తిగా కలిపివేసి అదనపు కరువుభత్యం మంజూరుచేయాలని రాష్ట్ర సివిల్ సర్వీసుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని మన్నించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం 9వ తేదీన జరిగినప్పుడు తీర్మానించబడింది.

సిబ్బంది అందరికీ రు. 20 లు సిటీ అలవెన్సుగా ఇవ్వాలనికోరుతూ మరో తీర్మానం కావించబడింది.

సెక్రటేరియట్ సిబ్బంది లోని ఆంధ్ర విభాగం వారి కష్టనిష్ఠూరాల విచారణకు ఒక గ్రీవెన్స్ కమిటిని వేయాలనికూడా యీ సమావేశములో కోరారు. హైదరాబాదులో పని చేస్తున్న ఆంధ్ర ప్రాంతోద్యోగుల పిల్లలకు ఉద్యోగకల్పనలో ముల్కీల ప్రాతిపదికపైనే ప్రాధాన్యయివ్వాలని కేంద్రాన్ని కోరాలని రాష్ట్రప్రభుత్వానికి యీ సమావేశం ఒక అభ్యర్థన చేసింది.

బేగంపేటలో నిర్మింపబడేసచివాలయ భవనంవద్